


# ప్రజాస్ఫూర్తి
PRAJASPOORTHI TELUGU DAILY
తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 03-04-2025 | సంపుటి - 22 | సంచిక - 339 | రూ : 4 | పేజీలు: 8


## వరంగల్ చపాటా మిర్చికి భౌగోళిక గుర్తింపు

- మందం, ప్రకాశవంతమైన రంగుతో ప్రత్యేకత

హైదరాబాద్: వరంగల్ చపాటా మిర్చికి భౌగోళిక గుర్తింపు (జీఐ) లభించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ జియోగ్రాఫికల్ ఇండికేషన్

తరువాయి 2లో





## 42% రిజర్వేషన్లకు
# పై అనకుంటే ధర్మయుద్ధమే

- డిమాండ్లకు మోదీ దిగైనా రావాలి.. గద్దె దిగైనా పోవాలి
- రాష్ట్రంలో అమలు చేసుకుంటే ప్రధానికేం ఇబ్బంది?
- ఢిల్లీ జంతర్‌మంతర్ మహాధర్నాలో సీఎం రేవంత్‌రెడ్డి

2లో

## భారత్‌పై ప్రతీకార సుంకం 26%

- ప్రతి దేశంపై కనీసం 10% సుంకం
- ఇప్పటికీ ఇతర దేశాలు విధిస్తున్న టారిఫ్‌ల్లో సగమే వేస్తున్నాం
- అర్ధరాత్రి నుంచి అమల్లోకి
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన

2లో






## 50 ఏళ్ల అవసరాలకు తగ్గట్లు
# తితిదేను తీర్చిదిద్దాలి

- సేవల్లో 100% మార్పు కనిపించాలి
- ఇష్టారీతిన డబ్బులు ఖర్చుపెట్టొద్దు
- సమీక్షలో సీఎం చంద్రబాబు

అమరావతి: తిరుమలకు భక్తుల రద్దీ రోజురోజుకూ పెరుగుతున్న నేప థ్యంలో.. వచ్చే 50 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా తితిదేను తీర్చిదిద్దాలని.. భక్తులకు అందించే సేవలు, సౌకర్యాల్లో 100 శాతం మార్పు కనిపించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. అవసరమైన పనులు మాత్రమే చేయా లని, శ్రీవారి సొమ్మును ఇష్టారీతిన ఖర్చుపెట్టొద్దని స్పష్టం చేశారు. మనం ధర్మకర్తలం, నిమిత్తమాత్రులమేనని.. స్వామివారికి భక్తులు కానుకల రూపంలో ఇచ్చే డబ్బును ఇష్టారీతిన ఖర్చు పెట్టే అధికారం ఎవరికీ లేదని తేల్చిచెప్పారు. తిరుమల

తరువాయి 2లో

## ఇరాన్ లక్ష్యంగా బి2 బాంబర్లు!

- డీగో గార్సియా దీవిలో ఆరింటిని మోహరించిన అమెరికా



దుబాయ్: ఇరాన్‌తో ఉద్రిక్తతలు పెరుగుతున్న వేళ హిందూ మహాసముద్రంలోని డీగో గార్సియా ద్వీపంలో శత్రుభీకర బి2 బాంబర్ల మోహరింపును అమెరికా పెంచుతోంది. ఆ దీవిలో ప్రస్తుతం కనీసం ఆరు బి2 బాంబర్లు ఉన్నట్లు తాజాగా ఉపగ్రహ చిత్రాల విశ్లేషణతో స్పష్టమవుతోంది. ఈ సంఖ్య గత వారంతో పోలిస్తే ఎక్కువ కావడం గమనార్హం. యెమెన్‌లో హూతీ తిరుగుబాటుదారులపై అమెరికా చాన్నాళ్లుగా

తరువాయి 2లో

## వక్ఫ్ బిల్లుకు
# లోక్‌సభ ఆమోదం

- అనుకూలంగా 288... వ్యతిరేకంగా 232 ఓట్లు
- 14 గంటలకు పైగా సుదీర్ఘ సమావేశం
- తెల్లవారుజాము వరకూ చర్చ
- విమర్శలు, ప్రతి విమర్శలతో మార్మోగిన సభ
- ప్రభుత్వంపై ఆరోపణలను తిప్పికొట్టిన రిజిజు, అమిత్ షా
- మైనారిటీల హక్కులను హరిస్తున్నారని ప్రతిపక్షాల ధ్వజం

2లో



## మీ మంత్రివర్గంలో 46 శాతం బీసీలు ఉన్నారా?

- 42 శాతం రిజర్వేషన్ల అమలు నుంచి తప్పించుకోవడానికే ధర్నా
- సీఎం రేవంత్‌రెడ్డిపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధ్వజం

2లో





# సంప్రదాయమే శాసనమై!

- * మూడోసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలను నిరాకరిస్తూ రాజ్యాంగ సవరణ
- * రూజ్‌వెల్ట్ ఒక్కరే నాలుగుసార్లు ఎన్నిక
- * ఆ తర్వాత కొత్త నిబంధన
- * అంతకు ముందు రెండు సార్ల సంప్రదాయాన్ని కొనసాగించిన అధ్యక్షులు

2లో

## ప్రాజెక్టులు అడ్డుకుంటే..
# రెడ్‌బుక్‌లోకి పేరు

- వైకాపా వాళ్లు పనిచేయరు.. చేయనివ్వరు
- పీ-4కు బయోగ్యాస్ ప్లాంట్ తొలి అడుగు
- ఐదేళ్లలో 25 లక్షల ఉద్యోగాలే లక్ష్యం
- సీబీజీ ప్లాంట్ భూమి పూజలో మంత్రి లోకేశ్

2లో



# 42% రిజర్వేషన్లకు సై అనకుంటే ధర్మయుద్ధమే

దిల్లీ: ''సంధి కోసం కనీసం ఐదు గ్రామాలైనా ఇవ్వాలని ఆనాడు కృష్ణుడు అడిగితే దుర్యోధనుడు వినకుండా విర్రవీగాడు. చివరకు కురుక్షేత్రంలో ఏం జరిగిందో అందరికీ తెలుసు. సయోధ్యలో భాగంగానే మేం హస్తినకు వచ్చి.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు అనుమతివ్వాలని మోదీకి విజ్ఞప్తి చేశాం. చట్టాలను సవరించి.. 42% రిజర్వేషన్ల అమలుకు అనుమతించకపోతే మీరు గద్దె దిగాల్సిందే.. గ్రామాల్లో మీ గద్దెలు కూలాల్సిందే. మమ్మల్ని తక్కువ అంచనా వేస్తే ఎర్రకోటపై జెండా ఎగరేస్తాం. మా రిజర్వేషన్లు మేం సాధిస్తాం'' అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రాష్ట్రంలో విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీ చేసిన తీర్మానానికి అనుగుణంగా రిజర్వేషన్లు పెంచుకోవడానికి అనుమతివ్వాలని కోరుతూ జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో పలు బీసీ సంఘాలు దిల్లీలోని జంతర్‌మంతర్‌లో బుధవారం మహాధర్నా నిర్వహించాయి. దీనికి సీఎం హాజరై మాట్లాడారు. ''బీసీలకు 42% రిజర్వేషన్లపై శాసనసభలో ఏకగ్రీవంగా తీర్మానించి పంపినా.. అనుమతివ్వడానికి ప్రధానికొచ్చిన కష్టమేంది? బిల్లుకు అనుకూలమని జంతర్‌మంతర్ వేదికగా 16 పార్టీలు ప్రకటించాయి. తాను బీసీల కోసమే ఉన్నానని ప్రధాని మోదీ అంటున్నారు. బీసీల కోసం ప్రాణాలిస్తామని బండి సంజయ్ ప్రకటిస్తున్నారు. మేం మీ ప్రాణాలు కాదు.. 42% రిజర్వేషన్లు మాత్రమే కోరుతున్నాం. దీనికి అనుమతివ్వకపోతే.. దేశమంతా జాగృతం చేసి అన్ని సంఘాలను కూడగడతాం. నిప్పురవ్వలా రగిలి దేశమంతటా కార్చిచ్చులా వ్యాపిస్తుంది. మీరు దిల్లీ గద్దెపై ఎలా ఉంటారో చూస్తాం. మా డిమాండ్లకు మోదీ దిగైనా రావాలి... లేదంటే గద్దె దిగైనా పోవాలి. 2015లో ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ జంతర్‌మంతర్‌లో ధర్నా చేసి అలసిపోయి చెట్టు కింద కూర్చున్నప్పుడు 'మీది ధర్మమైన కోరిక కాబట్టి ధర్మయుద్ధం ప్రకటించాల'ని నేను చెప్పడంతో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో లక్షల మంది సమక్షంలో ధర్మయుద్ధం ప్రకటించి విజయం సాధించి లక్ష్యం చేరుకున్నారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం స్పందించకుంటే పరేడ్ గ్రౌండ్‌లో పది లక్షల మందితో ధర్మయుద్ధం ప్రకటించి మన బలమేంటో చూపిద్దాం'' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

*** రాహుల్ గాంధీ హామీ నెరవేర్చేందుకే కులగణన**

''కులగణనకు స్ఫూర్తి రాహుల్ గాంధీయే. ఆయన కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు సుమారు 150 రోజులు.. 4 వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసినప్పుడు తమ జనాభా లెక్కలు తేల్చాలని ఆయనను బీసీ సంఘాల ప్రతినిధులు అడిగారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడానికి జనగణనతోపాటు కులగణన కూడా చేయాలని.. దేశంలో ఎవరెంత మంది ఉన్నారో లెక్కతేల్చి దామాషా ప్రకారం నిధులు కేటాయించాలని, నియామకాలు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. పార్టీ ఎక్కడ అధికారంలోకి వచ్చినా కులగణన చేస్తామని.. బీసీలకు ఉద్యోగావకాశాల్లోనే కాకుండా రాజకీయ రిజర్వేషన్లు పెంచుతామని రాహుల్ వాగ్దానం చేశారు. ఆయన ఇచ్చిన మాటను నెరవేర్చుతూ రాష్ట్రంలో మేం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే కులగణన పూర్తి చేసి.. దేశానికి దిక్సూచిగా నిలిచాం. దేశంలో ఇంత పకడ్బందీగా కులగణన చేసిన మొట్టమొదటి రాష్ట్రం తెలంగాణయే. భాజపా అధికారంలో ఉన్న ఏ రాష్ట్రంలోనూ కులగణన చేయలేదు. కులగణన లెక్కలను ఫిబ్రవరి 4న చట్టసభలో ప్రవేశపెట్టాం. రాష్ట్రంలో బలహీనవర్గాలవారు 56.36 శాతం మంది ఉన్నట్లు లెక్క తేలింది. వారికి స్థానిక సంస్థల్లోనే కాకుండా విద్య, ఉద్యోగాల్లో 42% రిజర్వేషన్లు అమలు చేసినప్పుడే న్యాయం జరుగుతుంది. రిజర్వేషన్ల పెంపు అంశం కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉంది కాబట్టే శాసనసభలో తీర్మానం చేసి పంపాం. మేం దీన్ని భాజపా పాలిత గుజరాత్, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలో అమలు చేయాలని అడగడం లేదు. తెలంగాణలో బీసీలకు 42% రిజర్వేషన్ల అమలుకు అనుమతివ్వాలని మాత్రమే అడుగుతున్నాం.

# 50 ఏళ్ల అవసరాలకు తగ్గట్లు తితిదేను తీర్చిదిద్దాలి

(మొదటిపేజీ తరువాయి)

తిరుపతి దేవస్థానాలపై సీఎం చంద్రబాబు దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్యచౌదరితోపాటు ఉన్నతాధికారులతో బుధవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. 'తితిదే రూ.వందల కోట్ల నిధులను అనేక కార్యక్రమాలకు ఖర్చు చేస్తోంది. అందులో ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం కాకూడదు. అంతర్గత ఆడిట్‌తోపాటు, కాగ్ ద్వారా కూడా ఆడిట్ జరిపించాలి. భక్తులు విరాళంగా ఇచ్చే ప్రతి రూపాయికీ జవాబుదారీతనం ఉండాలి' అని ఆదేశించారు. 'తితిదేలో సమూల ప్రక్షాళన చేస్తామని ఎన్నికల ముందు చెప్పాను. అధికారంలోకి వచ్చాక మార్పులు చేశాం.ఇంకా 100 శాతం మార్పులు ఉండాలి. ఎక్కడా పాత వాసనలు, పాత వ్యక్తులు ఉండకూడదు. అనుభవజ్ఞుల పేరుతో పాతవారెవరినీ ఎట్టి పరిస్థితుల్లోనూ కొనసాగించొద్దు. జేఈవో, చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ (సీవీఎస్‌వో), ఎస్వీబీసీ ఛైర్మన్, బర్డ్ ఆసుపత్రి డైరెక్టర్ల నియామకం త్వరలో చేపడతాం' అని సీఎం తెలిపారు. 'తితిదేకి చెందిన 15 రకాల సేవలను వాట్సప్ ద్వారా అందించే కార్యక్రమం వెంటనే ఆరంభించాలి. ప్రతి సేవకు ఆధార్, ఫోన్ నంబరును అనుసంధానిస్తే అక్రమాలకు అడ్డుకట్ట వేయొచ్చు. పారిశుద్ధ్య నిర్వహణపైనా ప్రత్యేక దృష్టి సారించాలి. తిరుమలలో పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు అన్ని అవకాశాలను వినియోగించుకోవాలి. తితిదే పరిధి 2,675 హెక్టార్లలో విస్తరించి ఉండగా, అందులో 68.14 శాతమే పచ్చదనం ఉంది. దీనికి 80 శాతానికి పెంచాలి' అని చంద్రబాబు ఆదేశించారు. శ్రీవారి సేవకుల్లో 90 శాతం కొత్తవారు ఉంటున్నారని అధికారులు తెలపగా, సగం మంది పాతవారు ఉండేలా చూస్తే నాణ్యమైన సేవలు అందించొచ్చని సీఎం సూచించారు. తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయానికి నిత్యం 25 వేల మంది వరకు భక్తులు వస్తారని అధికారులు వివరించగా.. ఈ ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అలిపిరిలో 25 వేల మంది భక్తులకు సౌకర్యంగా ఉండేలా బేస్ క్యాంప్ నిర్మాణం చేపడుతున్నామని, 60 అనుబంధ ఆలయాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నామని అధికారులు తెలిపారు.

# వక్ఫ్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

దిల్లీ: సుదీర్ఘ సంవాదాల అనంతరం వక్ఫ్ (సవరణ) బిల్లు 2025కు లోక్‌సభ ఆమోదం తెలిపింది. విపక్ష ఇండియా కూటమి, ఎంఐఎం తదితర పక్షాల ఆరోపణలను, విమర్శలను అధికార పక్షం గట్టిగా తిప్పికొట్టింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, మైనారిటీ వ్యవహారాల మంత్రి రిజిజు దీటుగా జవాబిచ్చారు. అధికార, విపక్ష సభ్యుల వాద ప్రతివాదాలతో సభ ప్రతిధ్వనించింది. బుధవారం మధ్యాహ్నం నుంచి గురువారం తెల్లవారుజాము 2.15 గం.లు దాటే వరకూ చర్చ, ఓటింగ్ ప్రక్రియ కొనసాగింది. బిల్లుకు అనుకూలంగా 288 మంది, వ్యతిరేకంగా 232 మంది సభ్యులు ఓటు వేశారు. 56 ఓట్ల తేడాతో ప్రతిపక్షాల అభ్యంతరాలు వీగిపోయాయి. ఇటీవల కాలంలో ఇంత సుదీర్ఘ సమయం పాటు లోక్‌సభ భేటీ కొనసాగడం ఇదే ప్రథమం. బిల్లుకు ఎన్డీయే ప్రధాన భాగస్వామ్యపక్షాలైన తెదేపా, జేడీ(యు), శివసేన (శిందే), లోక్‌జనశక్తి పార్టీ (రామ్‌విలాస్) మద్దతివ్వడంతో భాజపాలో ఉత్సాహం ఇనుమడించింది. మరోవైపు విపక్ష ఇండియా కూటమిలోని పార్టీలు ముక్తకంఠంతో బిల్లును వ్యతిరేకించాయి. తీవ్ర నిరసనను ప్రకటించిన ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ తన చేతిలోని బిల్లు ప్రతిని చింపివేశారు. వైకాపా కూడా బిల్లుకు ప్రతికూలంగానే స్పందించింది. చర్చ, ఆమోదం కోసం వక్ఫ్ బిల్లు గురువారం రాజ్యసభ ముందుకు రానుంది. విపక్షాల నిరసనల మధ్యే మధ్యాహ్నం 12 గంటల సమయంలో వక్ఫ్ బిల్లును ప్రవేశపెడుతూ కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడారు. ఈ బిల్లును తీసుకురాకపోతే.. పార్లమెంటు భూమిని కూడా వక్ఫ్ ఆస్తిగా చెబుతారని అన్నారు. సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) విస్తృత మంతనాలు జరిపి బిల్లులో పలు మార్పులు చేసిందని తెలిపారు. ముస్లింల మత వ్యవహారాల్లో జోక్యం చేసుకునే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని విస్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న వక్ఫ్ ఆస్తుల నిర్వహణను సమర్థంగా, పారదర్శంగా కొనసాగించటానికి యత్నిస్తున్నామని తెలిపారు. ''దేశంలో రైల్వేలు, రక్షణ శాఖ తర్వాత భారీగా ఆస్తులుంది వక్ఫ్ బోర్డుల నియంత్రణలోనే. రైల్వేలు, రక్షణ శాఖ ఆస్తులు దేశానికి చెందుతాయి. స్వభావ రీత్యా వక్ఫ్ ఆస్తులు ప్రైవేటువే. పేద ముస్లింలకు వీటిని ఉపయోగించాలి. నిరుపేదల ఉన్నతి కోసం మోదీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటే ఎందుకు వ్యతిరేకిస్తున్నారు? రిజిస్టర్ చేసిన ఆస్తి విషయంలో ఎవరూ జోక్యం చేసుకోరు. ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలతో ముస్లిం మహిళలు, పిల్లలకు వారి హక్కులు దక్కుతాయి'' అని రిజిజు తెలిపారు. వక్ఫ్ బిల్లు పేరును...యూనిఫైడ్ వక్ఫ్ మేనేజ్‌మెంట్ ఎంపవర్‌మెంట్, ఎఫీషియెన్సీ అండ్ డెవలప్‌మెంట్ బిల్లుగా (ఉమీద్ యుఎంఈఈడీ)గా వ్యవహరించనున్నట్లు చెప్పారు. దీంతోపాటు 'ముసల్మాన్ వక్ఫ్ (ఉపసంహరణ) బిల్లు 2024'ను కూడా లోక్‌సభలో చర్చ, ఆమోదం కోసం కిరణ్ రిజిజు ప్రవేశపెట్టారు. సుదీర్ఘ చర్చ అనంతరం విపక్షాల విమర్శలకు సమాధానమిస్తూ... 'ప్రపంచంలో మైనారిటీలకు భారత్ కన్నా సురక్షితమైన దేశం మరొకటి లేద'ని తెలిపారు. తాను కూడా మైనారిటీ వర్గానికి చెందిన వాడినేనని పేర్కొన్నారు. వక్ఫ్ ట్రైబ్యునళ్ల వద్ద చాలా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ బిల్లు చట్టరూపం దాల్చిన తర్వాత అవన్నీ సత్వరమే పరిష్కారమవుతాయని వివరించారు. అనంతరం విపక్ష సభ్యులు పట్టుపట్టడంతో సవరణలపై సభాపతి విడివిడిగా ఓటింగ్ నిర్వహించారు.

# మీ మంత్రివర్గంలో 46 శాతం బీసీలు ఉన్నారా?

ఢిల్లీ, హైదరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై అసెంబ్లీలో చేసిన బిల్లు అమలు నుంచి తప్పించుకోవడానికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీ సంఘాల ముసుగులో దిల్లీ జంతర్‌మంతర్‌లో ధర్నాకు దిగారని కేంద్ర మంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. బీసీలకు రిజర్వేషన్లు పెంచడంలో రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి లేదని.. తాము ముందు నుంచీ చెప్తున్నది ఇప్పుడు మరోసారి నిరూపితమైందన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ''బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చి ఇప్పుడు ఆ బాధ్యతను కేంద్రంపై ఎలా నెడతారు? రిజర్వేషన్ల పెంపు మీ పరిధిలో లేకపోతే ఆ హామీ ఎలా ఇచ్చారు? రేవంత్‌రెడ్డి అసలైన బీసీ ద్రోహి. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీయే ఇప్పుడు రేవంత్ వెనకుండి ఈ డ్రామాలు ఆడిస్తున్నారు. ఒక బీసీ వ్యక్తి ప్రధాని అయితే జీర్ణించుకోలేక మోదీని రాహుల్ గాంధీ తూలనాడిన విషయాన్ని బీసీలు ఇంకా మరచిపోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వేలో బీసీల జనాభా 46% అని చెప్తున్నారు. కానీ మంత్రివర్గంలో 46 శాతం బీసీలు ఉన్నారా? సగానికి పైగా ఉన్న బీసీలకు మీరిచ్చిన మంత్రి పదవులు రెండంటే రెండే. దీనిని బట్టే తెలుస్తుంది బీసీల మీద వారికి ఎంత ప్రేమ ఉందో. ప్రత్యేక ఎంబీసీ మంత్రిత్వశాఖ అన్నారు, ఏమైంది? మోదీ ప్రభుత్వం బీసీల సంక్షేమం, అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తోంది'' అని కిషన్‌రెడ్డి తెలిపారు.

# 'అమరావతి చిత్రకళ వీధి'తో కళాకారుల ప్రతిభకు గుర్తింపు

అమరావతి: 'అమరావతి చిత్రకళ వీధి' లాంటి వేదికల ద్వారా కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం కలుగుతుందని, ప్రభుత్వం కూడా దీనికి అన్ని విధాలుగా సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రాజమహేంద్రవరంలో శుక్రవారం జరగనున్న 'అమరావతి చిత్రకళ వీధి' కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను సాంస్కృతిక కమిషన్ ఛైర్‌పర్సన్ తేజస్వి.. సీఎంకు అందజేశారు. ఈ సందర్భంగా 'అమరావతి' థీమ్‌తో రూపొందించిన చిత్రానికి రంగులు వేసి చంద్రబాబు మద్దతు ప్రకటించారు. తన చిన్నతనంలో చిత్రలేఖనం వేసినప్పటి అనుభూతి కలిగినట్టు వివరించారు. ''కూటమి ప్రభుత్వంలో కళాకారులు, సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షిస్తున్నాం. ప్రోత్సహిస్తున్నాం. కళల్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళతాం'' అని చంద్రబాబు హామీ ఇచ్చారు.




## వరంగల్ చపాటా మిర్చికి భౌగోళిక గుర్తింపు

(మొదటిపేజీ తరువాయి)

రిజిస్ట్రీ నుంచి బుధవారం ధ్రువీకరణ పత్రం అందిందని శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఉపకులపతి (వీసీ) దండా రాజిరెడ్డి తెలిపారు. పలు ప్రత్యేకతలు ఉన్న వరంగల్ చపాటా మిర్చికి భౌగోళిక గుర్తింపు కోసం వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం తిమ్మంపేట మిరప రైతు ఉత్పత్తిదారుల సంఘం, మహబూబాబాద్ జిల్లా మల్యాలలోని ఉద్యాన పరిశోధన కేంద్రం, కొండా లక్ష్మణ్ వర్సిటీ.. జియోగ్రాఫికల్ ఇండికేషన్ రిజిస్ట్రీకి దరఖాస్తులు సమర్పించాయి. వీటిపై అధ్యయనం చేసిన రిజిస్ట్రీ తాజాగా భౌగోళిక గుర్తింపునకు ఆమోద ముద్ర వేస్తూ ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేసింది. వరంగల్ చపాటా మిరపకాయ పండ్లు లావుగా, ప్రకాశవంతమైన ఎరుపు రంగులో ఉంటాయి. కొద్దిగా టమాటా ఆకారంలో ఉండే వీటిని 'టమాటా మిరపకాయ' అని కూడా పిలుస్తున్నారు. తక్కువ ఘాటుతో రుచికరంగా, శుద్ధికి, ఎగుమతికి అనువుగా ఉంటాయి. పచ్చళ్లకు చపాటా మిర్చి పొడిని అధికంగా వాడుతుంటారు. మిఠాయిలతోపాటు ఆహార, సౌందర్య సాధనాలు, పానీయాలు, ఔషధ, వస్త్ర పరిశ్రమల్లోనూ చపాటా మిర్చిని రంగుగా ఉపయోగిస్తున్నారు. స్థానిక నేలలు, వాతావరణ అనుకూలతల వల్ల ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే ఈ పంట ఎక్కువగా సాగవుతోంది. ఇక్కడ 20 వేల మందికి పైగా రైతులు ఏటా దాదాపు 7 వేల ఎకరాల్లో 10 వేల టన్నులకు పైగా ఉత్పత్తి చేస్తున్నారు. భౌగోళిక గుర్తింపు లభించడం ద్వారా వరంగల్ చపాటా మిర్చి పంటకు డిమాండ్ పెరిగి ప్రపంచవ్యాప్తంగా విశేష ఖ్యాతి లభించనుందని ఉద్యాన వర్సిటీ వీసీ దండా రాజిరెడ్డి తెలిపారు. చపాటా మిర్చి సాగుచేసే రైతులకు భౌగోళిక గుర్తింపు ద్వారా ఎన్నో ప్రయోజనాలు దక్కనున్నాయని మల్యాలలోని ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త కె.భాస్కర్ వివరించారు. జీఐ కారణంగా చపాటా మిరపకు అంతర్జాతీయ విపణిలో మంచి ధర లభించి రైతుల ఆదాయం పెరగనుందని తిమ్మంపేట మిరప రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు రాజ్‌కుమార్‌రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు.

## భారత్‌పై ప్రతీకార సుంకం 26%

(మొదటిపేజీ తరువాయి)

వాణిజ్య విభాగం: ప్రపంచ దేశాలన్నీ ఉత్కంఠగా ఎదురు చూసిన ప్రకటన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి వెలువడింది. అన్ని దేశాల వారూ తమ ఉత్పత్తులను అమెరికా మార్కెట్లో విక్రయించుకోవచ్చని.. అయితే కనీసం 10% సుంకం చెల్లించాలని ఆయన స్పష్టం చేశారు. అమెరికా ఉత్పత్తులపై అధిక సుంకాలు విధిస్తున్న ఇతర దేశాలపై మాత్రం.. ఆయా దేశాలు విధిస్తున్న సుంకాల్లో సగం మేర తాము విధిస్తున్నట్లు స్పష్టం చేశారు. భారత్ తమ ఉత్పత్తులపై 52% సుంకం విధిస్తున్నందున, తాము 26% సుంకం విధిస్తున్నట్లు స్పష్టం చేశారు. భారత కాలమానం ప్రకారం బుధవారం అర్ధరాత్రి దాటాక 1.30 గంటలకు (అమెరికా కాలమానం ప్రకారం బుధవారం సాయంత్రం 4 గంటలకు) వాషింగ్టన్ డీసీలోని వైట్‌హౌస్ రోజ్‌గార్డెన్‌లో తన క్యాబినెట్ సహచరుల సమక్షంలో ట్రంప్ వివిధ దేశాలపై విధిస్తున్న ప్రతీకార సుంకాలను వెల్లడించారు. వీటికి సంబంధించిన అధికారిక ఆదేశాలపై సంతకం చేశారు. చైనా, జపాన్, థాయ్‌లాండ్, వియత్నాం, భారత్ తమపై అధిక సుంకాలు విధిస్తున్న విషయాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. అమెరికా పౌల్ట్రీ ఉత్పత్తులపై ఐరోపా కూటమి అనుసరిస్తున్న తీరును ట్రంప్ విమర్శించారు. వాహనాలు, వాహన విడిభాగాలపై 25 శాతం టారిఫ్ విధిస్తున్నట్లు తెలిపారు.

## ఇరాన్ లక్ష్యంగా బి2 బాంబర్లు!

(మొదటిపేజీ తరువాయి)

వైమానిక దాడులు చేస్తోంది. ఈ దాడుల్లో బి2 బాంబర్లను కూడా వినియోగించినట్లు ఇప్పటికే అంగీకరించింది. తాజాగా డీగో గార్సియాలో వాటి సంఖ్యను పెంచడానికి మాత్రం.. ఇరాన్‌తో ఉద్రిక్తతలే ప్రధాన కారణమంటూ విశ్లేషణలు వెలువడుతున్నాయి. వాషింగ్టన్ హెచ్చరికలను ఖాతరు చేయకుండా అణు కార్యక్రమాల్లో టెహ్రాన్ ఇటీవల జోరు పెంచింది. ఈ నేపథ్యంలో బి2 బాంబర్ల మోహరింపు ప్రాధాన్యం సంతరించుకుంది. ఇరాన్‌లోని భూగర్భ అణు కేంద్రాలను ధ్వంసం చేయగల సామర్థ్యమున్న భారీ 'జీబీయూ 57' బాంబులను ఈ బాంబర్లు మాత్రమే మోసుకెళ్లగలవని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఒక్కో జీబీయూ 57 బాంబు దాదాపు 12,300 కిలోల బరువుంటుంది.

## ప్రాజెక్టులు అడ్డుకుంటే.. రెడ్‌బుక్‌లోకి పేరు

(మొదటిపేజీ తరువాయి)

ఒంగోలు: న్యూస్‌టుడే, పీసీపల్లి: 'ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన పీ4కు రిలయన్స్ కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) ప్లాంట్లు నాంది కాబోతున్నాయి. వాటి స్థాపనతో రాష్ట్రంలో పేదరికం తొలగించే దిశగా తొలి అడుగు పడింది' అని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ప్రకాశం జిల్లా పీసీపల్లి మండలం దివాకరపల్లిలో రిలయన్స్ సీబీజీ ప్లాంట్‌కు భూమి పూజ, శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. అనంతరం కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో లోకేశ్ ప్రసంగించారు. పేదరికాన్ని తొలగించాలనే ఉద్దేశంతోనే ఐదేళ్లలో 25 లక్షల ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నానని చెప్పారు. వైకాపా నాయకులు పనిచేయరు.. చేసే వారిని చేయనీయరని ఎద్దేవా చేశారు. ఉపాధి కల్పనకు తెచ్చిన పరిశ్రమలను అడ్డుకుంటే రెడ్‌బుక్‌లోకి పేరు ఎక్కిస్తామని హెచ్చరించారు. తప్పుడు ప్రచారం చేసే వారిని వదిలి పెట్టబోమన్నారు.

**కంపెనీలు ఏం తెచ్చారంటే.. సౌండ్ రాలేదు**

ఉమ్మడి అనంతపురంలో ఆటోమొబైల్ హబ్, చిత్తూరు, కడపలో ఎలక్ట్రానిక్స్ కంపెనీలు, కర్నూలుకు పునరుత్పత్తి ఇంధన కంపెనీ, ప్రకాశం జిల్లాకు పేపర్ మిల్లును తీసుకొస్తే గత ప్రభుత్వం రానివ్వలేదని లోకేశ్ తెలిపారు. గత ఐదేళ్ల వైకాపా పాలనలో రాష్ట్రంలో విధ్వంసం చోటుచేసుకుందని, కొత్త కంపెనీలు తీసుకురాకున్నా.. ఉన్న లులు, అమరరాజ, హెచ్‌ఎస్బీసీ, జాకీ వంటి కంపెనీల్లో వాటాలు ఇవ్వలేదని తరిమేశారని ఆరోపించారు. మీరు తీసుకొచ్చిన ఒక్క కంపెనీ పేరు చెప్పాలని నాడు ముఖ్యమంత్రిగా ఉన్న పులివెందుల ఎమ్మెల్యేను అడిగితే అటు నుంచి సౌండ్ రాలేదని ఎద్దేవా చేశారు.

## సంప్రదాయమే శాసనమై!

(మొదటిపేజీ తరువాయి)

అమెరికా అధ్యక్షుడిగా ఫ్రాంక్లిన్ డెలానో రూజ్‌వెల్ట్ ఒక్కరే నాలుగుసార్లు బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు.. ఆ తర్వాత ఎవరూ రెండు సార్లకు మించి అధ్యక్షుడిగా పని చేయలేదు. దీనికి రెండు కారణాలున్నాయి. ఒకటి.. రూజ్‌వెల్ట్ కంటే ముందు పని చేసినవారు రెండు సార్ల కంటే ఎక్కువ పని చేయకూడదనే సంప్రదాయాన్ని పాటించారు. అప్పట్లో ఎటువంటి రాజ్యాంగ నిబంధన లేదు. సంప్రదాయాన్ని రూజ్‌వెల్ట్ పాటించకపోవడంతో అమెరికా శాసనకర్తలు రాజ్యాంగ సవరణ ద్వారా రెండు సార్ల నిబంధనను తీసుకొచ్చారు. అమెరికా అధ్యక్షుడిగా మూడోసారి ఎన్నిక కావడానికి మార్గాలున్నాయని ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల వ్యాఖ్యానించిన నేపథ్యంలో మరోసారి ఈ అంశం తెరమీదకు వచ్చింది. తొలి తరం అధ్యక్షుల స్వచ్ఛంద నిర్ణయంతో.. 1940లో రూజ్‌వెల్ట్ మూడోసారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అంతకు ముందు.. పని చేసిన అధ్యక్షులందరూ రెండు సార్ల సంప్రదాయాన్ని కొనసాగించారు. ఈ సంప్రదాయానికి తొలి తరం అధ్యక్షులు జార్జి వాషింగ్టన్, థామస్ జెఫర్సన్, జేమ్స్ మాడిసన్ పునాది వేశారు. వారు స్వచ్ఛందంగా మూడోసారి పోటీ చేసే అవకాశాల్ని వదులుకున్నారు. దానిని ఆ తర్వాత వచ్చిన అధ్యక్షులంతా కొనసాగించారు.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కు ఘన నివాళి

యాదాద్రి భువనగిరి , ప్రజాస్ఫూర్తి : సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి పురస్కరించుకొని బుధవారం పట్టణ సేవాదళ్ ఆధ్వర్యంలో కిలానగర్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పీసీసీ సభ్యులు తంగళ్ళపల్లి రవికుమార్ పాల్గొని పూలమాలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ గౌడ వృత్తి తన గేరిల్లా సైన్యంతో దాడి చేయించేవారన్నారు. రాజ్యాన్ని స్థాపించిన జనగాం జిల్లా రఘునాథ్ పల్లి మండలం కిలాసపూర్ గ్రామంలో జన్మించిన సర్దార్ పాపయ్య గౌడ్ గౌడ వంశంలో పుట్టిన పాపన్న గౌడ్ చిన్ననాటి నుంచి అన్యాయాలపై రాజ్యాధికారం సాధించానుగ్రహం పెడుతున్నారన్నారు. రాజ్యాధికారం సాధించండి పాపన్న సామ్రాజ్యం తాటి తాటికొండ కొలనుపాక చేర్యాల నుండి కరీంనగర్లో హుస్సేనాబాద్ హుజూరాబాద్ విస్త రించిందన్నారు. పాపన్న ముస్లిం మతాన్ని చెందిన ఒక స్త్రీ వివాహం చేసుకున్నా భువనగిరి కోట ను



రాజధాని చేసుకొని అతను 30 సంవత్సరాలు పాలించారన్నారు. జానపద కళాకారులు తరతరాలుగా మూడు నుంచి నాలుగు వందల ఏళ్ళు గడిచిన జానపద కథలలో పాపన్న చరిత్ర ఇప్పటికీ స్థానికంగా పాడుతారన్నారు. పాపన్న ఒక సాధారణ గౌడ్ కుటుంబం నుంచి వచ్చిన నాయకుడు అతని ప్రజలు కష్టాలు తెలుసు పాపన్న రాజ్యంలో పనులు లేవు ఖాజానా కొరకు అతను జమిందారు విభేదారులపై గేరెల్లా సైన్యంతో దాడి చేయించారన్నారు. అతని రాజ్యంలో సామాజిక న్యాయం పాలించాడు నిర్మించాడు అతను ఎల్లమ్మకు పరమ భక్తుడు ఎల్లమ్మ గుడి కట్టించారన్నారు. తెలంగాణ మొగలు విస్తరణ తొలిసారిగా అడ్డుపడింది సర్వాయి పాపన్ననే అతని సామ్రాజ్యం తాటికొండ కొలనుపాక చేర్యాల కరీంనగర్ హుస్నాబాద్ కిలాసాపూర్ లోని రాజధానిగా చేసుకొని 1675లో సర్వాయిపేటలో తన రాజ్యాన్ని స్థాపించాడు అతని తరుపున పోరాటానికి గలిల సైన్యం పెద్ద సంఖ్యలో ప్రజలు పెంచగల సామర్థ్యం అతనికి 10000 నుంచి 12000 విస్తృతంగా పెంచారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ మాజీ పచ్చళ్ళజగన్, రాష్ట్ర కార్యదర్శి పిట్టల బాలరాజ్, చామల యువసేన అధ్యక్షులు హెరాకర్ శ్రీనివాస్ ,మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రఘుబాబు, ఓబిసి జిల్లా అధ్యక్షులు కొత్త బాల్రాజ్, మైనార్టీ నాయకులు ఎండి కరీం, మీ సుబ్బురు సిద్దేశ్ వల్లపు నరసింహ యాదవ్, కనుగంటి ప్రేమ్ కుమార్, సేవాదళ్ డాకూరి ప్రకాష్, పల్లెపాటిరామాంజి తది తరులు పాల్గొన్నారు

## మృతుని కుటుంబానికి దాతల సహకారంతో రూ.2 5వేల ఆర్థిక సహాయం



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ పట్టణ కేంద్రానికి చెందిన గురుకు సత్యం గత 15 రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా మృతుని కుటుంబ దీన స్థితిని తెలుసుకున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గజ్జల రాజు సోషల్ మీడియా ద్వారా దాతలు ముందు వచ్చి ఆర్థిక సహాయం అందించాలని కోరారు. దీంతో పలువురు దాతలు ముందుకు వచ్చి అందించిన విరాళాలు జమా చేసి, 25వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని మృతుని కుటుంబ సభ్యులకు బుధవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. మృతుని కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని, వారి పిల్లల చదువుల కొరకు తగిన సహాయ సహకారాలు అందిస్తామని, ఆ కుటుంబానికి మనోధైర్యం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రంజాన్ నరేష్, మిడిదొడ్డి భాను, శీల ప్రశాంత్, ఆగుల్ల రాజేశం, పిట్ల విట్టల్, తలారి నర్సింలు, ఎద్దండి మహేందర్, మద్దికుంట సత్తన్న, జాల బిక్షపతి, కంచం నరసింహులు, అనమేని రాములు, తిరుపతి తదితరులున్నారు.

## యాదగిరిగుట్ట బార్ అసోసియేషన్ నూతన ఉపాధ్యక్షునిగా పెంట రమేష్



రాజాపేట, ప్రజా స్ఫూర్తి : రాజావపేటకు చెందిన ప్రముఖ సీనియర్ న్యాయవాది పెంట రమేష్ యాదగిరిగుట్ట బార్ అసోసియేషన్ నూతన ఉపాధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారులు మొగుళ్ళ రాజి రెడ్డి, దండబోయిన గణేష్ యాదవ్ లు ధృవీకరణ పత్రం అందజేశారు .ఈ సందర్భంగా ఉపాధ్యక్షునిగా ఎన్నికైన పెంట రమేష్ మాట్లాడుతూ నా ఎన్నికకు సహకరించిన మాజీ అధ్యక్షుడు గుడ్ల స్వామి, నూతన అధ్యక్షులు సూదగాని శ్రీహరి, ఐరెని కృష్ణ , కోన్నె వేంకటేశం, దండబోయిన గణేష్ యాదవ్, బి.రేణుక, శారసి సంతోష , బొందుగుల నవిత, కె.కనకరాజు, గొట్టిపాముల సాయికృష్ణ, ఎర్రగుంట కిరణ్, దప్పు వీరాస్వామిలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, యాదగిరిగుట్ట బార్ అసోసియేషన్ అభివృద్ధి కృషి చేస్తానని తెలిపారు.

## ఉచితంగా సన్న బియ్యం పంపిణి కార్యక్రమాన్ని ప్రారంభం



యాదాద్రి భువనగిరి , ప్రజాస్ఫూర్తి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టత్మాకంగా తీసుకొని అందరితో పాటు పేదలు కూడ మంచి ఆహారాన్ని తినాలని వారి ఆత్మ గౌరవాన్ని నిలబెట్టాలని ఉచితంగా సన్న బియ్యం పంపిణి కార్యక్రమాన్ని తెలుగు నూతన సంవత్సరం ఉగాది పండుగ రోజున ప్రారంభించటం జరిగింది అందులో భాగంగా.మీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలన్న ఆదేశానుసరం బుధవారం తుర్కపల్లి మండలంలోని తిర్మలాపూర్ గ్రామంలో సన్న బియ్యం కార్యక్రమాన్ని ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఐనాల చైతన్య మహేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ , ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ, కార్యదర్శి, గ్రామ ముఖ్య నాయకులు, సంఘ బంధం అధ్యక్షురాలు, ఫీల్డ్ అసిస్టెంట్, పెద్దలు, రేషన్ కార్డు దారులు గ్రామ స్థాయి అధికారులు ప్రజా ప్రతినిధులు అధిక సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు

## హెచ్ సి యు భూములను కార్పొరేట్ సంస్థలకు ఇవ్వద్దు

*** విద్యార్థి సంఘాలు సిపిఎం నాయకులు అక్రమ అరెస్టులకు నిరసనగా ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించిన నాలుగు వందల ఎకరాల భూమిని వేలం ప్రక్రియ చేపట్టి కార్పొరేట్ సంస్థలకు అప్పచెప్పొద్దని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ డిమాండ్ చేశారు.విద్యార్థి సంఘాలు , సిపిఎం నాయకుల అక్రమ అరెస్టులను నిరసిస్తూ స్థానిక బస్టాండ్ సెంటర్లో ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ వేలంపాట వేసి భూములు అమ్మడం వలన పర్యావరణం దెబ్బతిని జీవవైవిద్యం నాశనం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు ఆ భూమి పరిరక్షణ కోసం విద్యార్థులు ఆందోళన చేస్తుంటే ఆందోళన చేస్తున్న విద్యార్థులను వారికి మద్దతుగా నిలిచిన సిపిఎం నాయకులను ప్రభుత్వం నిరంకుశంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లో ఉంచిందని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అసెంబ్లీ సాక్షిగా రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఏడవ గ్యారెంటీగా ప్రజాస్వామ్య పునరుద్ధరణ ఉంటుందని చెప్పారని ఆందోళన చేస్తున్న విద్యార్థులు రాజకీయ పార్టీల నాయకులను అరెస్టు చేయడమేనా ఏడో గ్యారెంటీ అని అన్నారు. ప్రభుత్వం హెచ్ సి యు భూములపై కన్నేసిందని కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పే కుట్రలు చేస్తుందని విమర్శించారు. 50 ఏళ్ల క్రితమే ప్రభుత్వం సెంట్రల్ యూనివర్సిటీకి ఆ భూములు కేటాయించిందని గతంలో చంద్రబాబునాయుడు ప్రభుత్వం కూడా ప్రైవేటు వ్యక్తులకు ఆ భూమిని అప్పజెప్పలనే ప్రయత్నం చేసిందని తర్వాత వచ్చిన ప్రభుత్వాలు దాని రద్దు చేశాయని తిరిగి అదే భూమిని హెచ్ సి డి కేటాయించారని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వేలం ప్రక్రియ ద్వారా ఆ భూములను కార్పొరేట్ సంస్థలకు అప్పచెప్పలనే ప్రయత్నం చేస్తుందని ఇది సరైన పద్ధతి కాదని హెచ్చరించారు. వేలం ప్రక్రియ ద్వారా సెంట్రల్ యూనివర్సిటీ భూములను అమ్మాలని ప్రభుత్వ విధానాలను వెనక్కి తీసుకోవాలని విద్యార్థుల పోరాటానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. యూనివర్సిటీ భూముల పరిరక్షణ కొరకు విద్యార్థులు చేస్తున్న పోరాటానికి భవిష్యత్తులో సిపిఎం అండగా ఉంటుందని అరెస్టులు నిర్బంధాల ద్వారా ఉద్యమాన్ని అణిచివేయలేరని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే బ్రహ్మాచారి, లిక్కి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్, నాయకులు డి వీరన్న, సందుకూరి లక్ష్మి, కే సత్య ,విజయగిరి శ్రీను, రామ్ చరణ్, సాయి ,తదితరులు పాల్గొన్నారు.

## పేద కుటుంబాల ఆకలి తీర్చడమే ప్రభుత్వ లక్ష్యం

*** కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ షబ్బీర్ బాబా..**

ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : నల్గొండ మండల పరిధి లోని కాజీరామారం గ్రామంలో బుధవారం కాంగ్రెస్ సీనియర్ నాయకులు, గ్రామ మాజీ సర్పంచ్ మున్వర్ ఉన్నిసా షబ్బీర్ బాబా, గ్రామ రేషన్ డీలర్ రవికుమార్ తో కలిసి సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్.కె షబ్బీర్ బాబా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో టిఆర్ఎస్ పార్టీ పది సంవత్సరాలు అధికారంలో ఉండి చేయలేని పనిని కాంగ్రెస్ పార్టీ 15 నెలల్లోనే చేసిందని అన్నారు. రాష్ట్రంలోని ప్రతి నిరు పేద కుటుంబ కడుపునిండా భోజనం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజా ప్రతినిధులు ఎస్.కె మమ్మద్,గోలి కృష్ణ, అనంతుల వేణు ,సల్వాది సైదులు, నకరికంటి సైదులు, దండంపల్లి యుగంధర్, బొంగరాల నాగయ్య, పేరుపాక మనోహర్, బొడ్డుపల్లి రాజేష్, చింత రవి, జాఫర్, గ్రామ ప్రజలు మహిళలు రేషన్ వినియోగదారులు, తదితరులు



పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ల చిత్రపటాలకు పాలాభిషేకం... తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సన్న బియ్యం పథకం ప్రారంభించి అందిస్తున్నందున కాజిరామారం గ్రామ కాంగ్రెస్ పార్టీ, గ్రామ మాజీ సర్పంచ్ షబ్బీర్ బాబా ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు.. పాలాభిషేకం గ్రామ మహిళల సైతం పెద్ద ఎత్తున పాల్గొని పాలాభిషేకం నిర్వహించారు..

## సర్వే నంబర్ 145, 163 పార్ట్ లలో ఇళ్ల నిర్మాణం కోసం అనుమతులు జారీ చేయాలి

*** జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రును కలిసి వినతి పత్రం అందజేసిన ఎమ్మెల్యే కృష్ణారావు**

కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : కూకట్పల్లి నియోజక వర్గం పరిధిలోని కేపీహెచ్బీ కాలనీ డివిజన్ హైదర్ నగర్ గ్రామ సర్వే నంబర్ 145, 163 పార్ట్ లలో ఇళ్ల నిర్మాణం కోసం అనుమతులు జారీ చేయాలని కోరుతూ కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బుధవారం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రును కలిసి కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత మార్చి నెల నుంచి ఇక్కడి సర్వే నంబర్ లలోని సాయి నగర్, సర్దార్ పటేల్ నగర్, వసంత నగర్, భగత్ సింగ్ నగర్, సీబీసీఐడీ కాలనీ, ఎన్ ఆర్ ఎస్ ఏ కాలనీ, ఎస్.ఎస్.కాలనీ లలో గత నలభై ఏళ్లు కిందటనే లే అవుట్ చేసి ఇళ్ల స్థలాలు గా అభివృద్ధి చేసారన్నారు. అప్పటి నుంచి గత మార్చి నెల వరకు ఇళ్ల నిర్మాణం కోసం గ్రామ పంచాయతీ



మొదలుకొని మున్సిపాలిటీలు జీహెచ్ఎంసీ వరకు అనుమతులను జారీ చేశారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గత నెల నుంచి ఇంతవరకు ఇళ్ల నిర్మాణం కోసం అనుమతులను మంజూరు చేయకుండా జీహెచ్ఎంసీ అధికారులు కలెక్టర్ వద్దకు ఫైల్ పంపుతున్నారన్నారు. అకస్మాత్తుగా అనుమతులను నిలిపివేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

## రాజపేటలో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతి



రాజపేట, ప్రజా స్ఫూర్తి : రాజపేట మండల కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. తహసిల్దార్ కార్యాలయం వద్ద అధికారికంగా నిర్వహించి చిత్రపటానికి తహసిల్దార్ ఇంద్రాకర్ అనిత పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాజాపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నమిల మహేందర్ గౌడ్,నాయబ్ తహసిల్దార్ వెంకటేశ్వర్లు రెడ్డి, ఆర్ఐ రమేష్, నరసింహ, అన్ని పార్టీల నాయకులు, జర్నలిస్టులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. రాజపేటలోని మహాత్మా గాంధీ కూడలి వద్ద నిర్వహించిన కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు పాల్గొని పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయసాధనలో అందరూ భాగస్వామ్యం కావాలని కోరారు.

## రాజపేటలో మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



రాజపేట, ప్రజా స్ఫూర్తి : రాజపేట బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో బుధవారం రేషన్ షాపు వద్ద కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న సన్న బియ్యం గురించి ప్రజలకు తెలుపుచూ ప్రధాని నరేంద్ర మోడీ ఫోటో కు పాలాభిషేకం చేశారు.. పేదలకు సన్నబియ్యం ఇస్తున్న నరేంద్ర మోది కి పాలాభిషేకం చేసి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాచేపల్లి శ్రీనివాస్, భూక్యా శ్రీను నాయక్, కుమ్మరి లక్ష్మణ్, కోయ మధు, విజయ్ కుమార్, శ్రీ హరి, మ్యాఖ రవి, కుమ్మరి ప్రవీణ్, మెండు భగవాన్ రెడ్డి, బూరుగు శేఖర్ రెడ్డి, ఛాపురం శ్రీశైలం, రాజం నగేష్, మార్క శివ, చెప్పాల శ్రీశైలం, ఎండీ ఖాజా తదితరులు పాల్గొన్నారు.

## రోడ్ల మీద అనుమతులు లేకుండా కార్యక్రమాలు చేపడితే చర్యలు

*** ముస్తాబాద్ ఎస్ఐ సిహెచ్.గణేష్**

*** శ్రీవాణి స్కూల్ యాజమాన్యంపై కేసు**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: రోడ్ల మీద ఎలాంటి అనుమతులు లేకుండా కార్యక్రమాలు చేపడితే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ముస్తాబాద్ ఎస్ఐ సిహెచ్.గణేష్ హెచ్చరించారు. ముస్తాబాద్ మండల కేంద్రంలోని బుధవారం సాయంత్రం ఎలాంటి అనుమతులు లేకుండా రోడ్డు మీద పాఠశాల వార్షికోత్సవ వేడుకలు నిర్వహించిన శ్రీవాణి స్కూల్ యాజమాన్యంపై, ప్రోగ్రాం ఆర్గనైజర్స్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. రోడ్డుపై వచ్చి పోయే వారికి అంతరాయం కలుగజేసే విధంగా ఎలాంటి అనుమతులు లేకుండా రోడ్డు మీద పాఠశాల వార్షికోత్సవ వేడుకలు నిర్వహించినందుకు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించనట్లు తెలిపారు. అనుమతులు లేకుండా ఎవరూ కూడా రోడ్లపై ఇలాంటి కార్యక్రమాలు చేపట్ట వద్దని, ఒకవేళ అనుమతులు లేకుండా రోడ్డపై కార్యక్రమాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

# బార్ లపై ధ్యాస.. నీటి కష్టాలు నిర్మూలించడంలో శూన్యం

* **బిజెపి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మహిళలు ఖాళీ బిందెలతో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా**
* **మున్సిపల్ కమిషనర్ కు వినతి**
* **గంగిడి మనోహర్ రెడ్డి, నాగం వర్షిత్ రెడ్డి**






చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా 40బార్లు ఏర్పాటు చేయడంలో ఉన్నధ్యాస..నిండు వేసవిలో ప్రజలకు త్రాగునీటి కష్టాలు తీర్చడంలో ప్రభుత్వం ఆలోచన శూన్యమని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్ రెడ్డి, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డిలు ఆగ్రహం వ్యక్తం చేశారు. చౌటుప్పల్ మున్సిపల్ వ్యాప్తంగా త్రాగునీటి కష్టాలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ అధ్యక్షురాలు కడారి కల్పన ఐలయ్య యాదవ్ ఆధ్వర్యంలో చౌటుప్పల్ మున్సిపల్ కార్యాలయం ఎదుట బుధవారం మహిళలతో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. అంతకుముందు గాంధీ పార్క్ నుంచి బిజెపి శ్రేణులు పెద్ద ఎత్తున మహిళలతో కలిసి ఖాళీ బిందెలతో భారీ ర్యాలీ నిర్వహించారు. గాంధీ పార్క్ నుంచి బస్టాండ్ ఆవరణ జాతీయ రహదారి వెంట తంగడపల్లి రోడ్డు నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. మున్సిపల్ వ్యాప్తంగా ప్రజలకు వినియోగానికి సరిపడా సాగునీటిని అందించాలని నినాదాలు చేశారు. ఈ ఈ సందర్భంగా గంగిడి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పదవుల కోసమే తపిస్తున్నాడు తప్ప, పని చేయడం లేదని ఆరోపించారు. తనకు హోంశాఖ పదవి వస్తే తప్ప నేను మునుగోడు ప్రజలను కలుసుకోలేను అన్న ధ్యాసలో రాజగోపాల్ రెడ్డి ఉన్నారని ఆరోపించారు. ఎలక్షన్ వచ్చినప్పుడు తప్ప ప్రజా సమస్యల మీద ఎప్పుడు ఎమ్మెల్యే దృష్టి సారించలేదని ఆరోపించారు. పోలీసులు ఉంటే తప్ప తాను మునుగోడు అసెంబ్లీలో తిరగలేనని, మంత్రి పదవి కోసం పాకులాడుతున్నారు ఆరోపించారు. డాక్టర్ శ్రీ నాగం వర్షిత్ రెడ్డి మాట్లాడుతూ మహిళలకు బిజెపి పార్టీ సముచిత స్థానం కల్పించిందని, చౌటుప్పల్ మున్సిపాలిటీకి ఒక మహిళను బిజెపి పార్టీ అధ్యక్షురాలుని చేసి గౌరవించిందన్నారు. ఈ మహిళలు కాంగ్రెస్ కు బుద్ధి చెప్పాలన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులకు చౌటుప్పల్ ప్రజలకు త్రాగునీటి సమస్య లేకుండా చేయాలన్నారు. బెల్టు షాపులకు ఇచ్చిన ప్రాధాన్యత మంచినీటి మీద ఇవ్వాలన్నారు. స్థానిక అధికారులు కల్పించుకొని మంచినీటి సమస్య లేకుండా చేయాలని విన్నవించారు. అనంతరం చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ కోమటిరెడ్డి నరసింహారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మునుగోడు నియోజకవర్గ కన్వీనర్ దూడల భిక్షం గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు రమణగోని శంకర్, బిజెపి చౌటుప్పల్ మండల అధ్యక్షుడు కైరంకొండ అశోక్, సీనియర్ నాయకులు గుజ్జుల సురేందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ పోలోజు శ్రీధర్ బాబు , కౌన్సిల్ సభ్యుడు కంచర్ల గోవర్ధన్ రెడ్డి, ముత్యాల భూపాల్ రెడ్డి, ఆలే చిరంజీవి, లింగోజిగూడెం మాజీ సర్పంచ్ రమణగోని దీపిక, పాలకూర్ల జంగయ్య గౌడ్, శాగ చంద్రశేఖర్ రెడ్డి, ఉడుగు యాదయ్య గౌడ్, కాసుల వెంకటేశం, రాధారపు సత్తయ్య, కడవేరు పాండు, చిలువేరు దుర్గయ్య, కట్ట కృష్ణ,గోషిక పురుషోత్తం, తడక సురేఖ, గోశిక నీరజ, ఊడుగు విజయలక్ష్మి, ముత్యాల పుష్ప, వనం ధనంజయ, కడారి ఐలయ్య యాదవ్, ఎడ్ల మహేశ్వర్ రెడ్డి, అమృతం దశరథ, బడుగు కృష్ణ, ఉబ్బు ఆంజనేయులు , బుడ్డ సురేష్ ,పాలెం అశోక్, కంచర్ల సరిత,వనం జయశ్రీ, గుజ్జుల సునీత, ఎడ్ల నిర్మల, ఊదరి శారద, బత్తిని విజయలక్ష్మి , బొడ్డు రేణుక, దిండు భాస్కర్, పబ్బు వంశీ, ఉష్కాగుల నాగరాజు, ఊదరి రంగయ్య, శ్రీధర్, ఒరగంటి భాను, వంగాల రామాకాంత్, బూత్ అధ్యక్షుడు ఇటుకల దామోదర్ రెడ్డి, బాతరాజు ప్రవీణ్, చేకూరి సాయి, చెరుకు శివ,గోశిక భావనారుషి, బొడ్డు మల్లేశం బొల్లమోని శ్రీశైలం గట్టు మొగలయ్య, కానుగు శేఖర్, కానుగు కొండల్, కడారి ఝాన్సీ, దాసర్ల సత్తమ్మ, ఎర్రగొని ఐలమ్మ, తీగలి నరసమ్మ, ఎర్రగోని పద్మ, వెంకటమ్మ, పెంటమ్మ, కాసోజు సుగుణమ్మ, నవ్య, మాధగోని జయమ్మ, జ్యోతి, సత్తమ్మ కంచర్ల శ్రీలత, అండాలు, సత్య, ప్రసన్న, మహేశ్వరి, ఉమా ,అశ్విని స్వాతి, లత, నస్రిన్, యామిని, భాగ్యమ్మ, రమ, దేవి, జ్యోతి, సరిత, రామాంజమ్మ, మమత, సంపూర్ణ, పద్మ, శ్రీలత, శివాని, శిరీష, లక్ష్మి, ఝాన్సీ, సుమతి, విజయలక్ష్మి, రాధ, వెన్నెల, శశి, సుగుణమ్మ, జయ, మహిళా పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గ్రూప్1లో రాష్ట్ర స్థాయిలో 303 ర్యాంకు సాధించిన ధరావత్ సబితకు ఘన సన్మానం

* **కలెక్టర్ కావాలన్నదే లక్ష్యం ధరావత్ సబిత**



యాదాద్రి భువనగిరి, ప్రజాస్ఫూర్తి : కుషాయిగూడ చక్రీపురం మధురా నగర్కు చెందిన ధరావత్ సబిత 303 ర్యాంకు సాధించారు. 2017లో బీటెక్ పూర్తి చేసిన సబిత రెండేళ్ల పాటు సాఫ్ట్వేర్ ఉద్యోగం చేశారు. ఆ తర్వాత కలెక్టర్ కావాలన్న లక్ష్యంతో పోటీ పరీక్షలకు హాజరయ్యారు. 2019లో జూనియర్ అసిస్టెంట్ గా ఉద్యోగం సాధించారు. 2024 చివరలో గ్రూప్ 4లో వార్డు ఆఫీసర్ ఉద్యోగానికి ఎంపికై విధులు నిర్వహించారు. గ్రూప్ 1 పరీక్ష రాసి రాష్ట్ర స్థాయిలో 303 ర్యాంకు, మల్టీజోన్2మహిళా విభాగంలో 7వ ర్యాంకు, ఎస్టీ కోటా జనరల్లో 14వ ర్యాంకు సాధించారు. డీఎస్పీ పోస్టు వచ్చే అవకాశం ఉంది. అయితే, కలెక్టర్ సేవ చేయాలన్నదే తన లక్ష్యంగా చెబుతున్నారు. ఈ కార్యక్రమంలో బొమ్మల రామారం బీజేపీ అధ్యక్షుడు వినోద్ నాయక్, యాదాద్రి జిల్లా ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షుడు శంకర్ నాయక్, కృష్ణనాయక్,సురేష్, రవి నాయక్, గుగులోత్ సురేశ్ నాయక్ పాల్గొనడం జరిగింది

## డిగ్రీ కళాశాలల ప్రాక్టికల్ పరీక్షల బహిష్కరణ




యాదాద్రి భువనగిరి , ప్రజాస్ఫూర్తి : తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ డిగ్రీ పీజీ కళాశాలల మేనేజ్మెంట్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని కోరుతూ శ్రీ సాయి కృప డిగ్రీ అండ్ పీజీ కళాశాల భువనగిరి కరస్పాండెంట్ దరిపల్లి ప్రవీణ్ కుమార్ తోపాటు ప్రిన్సిపల్ మరియు అధ్యాపకులు ప్రాక్టికల్ పరీక్షలను బహిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ యూనివర్సిటీ పరిధి ఉమ్మడి నల్గొండ జిల్లా ఫైనాన్స్ సెక్రటరీ దరిపల్లి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలు నుండి రీయంబర్స్మెంట్ లేక మరియు విద్యార్థులకు స్కాలర్ షిప్ లు రాక యాజమాన్యాలు మరియు విద్యార్థులకు ఆర్థికంగా ఎంతో ఇబ్బంది కలుగుతుందని యాజమాన్యాలు అప్పుల ఊబిలో కోరుకుపోయి వడ్డీలు కట్టలేనీ పరిస్థితులలో ఉన్నారని ఇది ఇలాగే కొనసాగితే యాజమాన్యాలు ఎంతో మనోవేదన అనుభవించాల్సి ఉంటుందని కళాశాలలు నడపలేరని, తద్వారా మన రాష్ట్రానికి ఎంతో నాణ్యమైన విద్యని అందించే ప్రైవేటు యాజమాన్యాలు కళాశాలలు నడపలేకపోతే రాష్ట్రనికి నైపుణ్యం గల విద్యార్థులు లేక మొదటి స్థానంలో ఉన్న మన తెలంగాణ రాష్ట్రం చివరి స్థానానికి పోతుందని, మన తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తు ఇప్పుడు నడుపుతున్న ఈ ప్రభుత్వానికి ఎంతో నష్టమని వెంటనే ఫీజు రీయింబర్స్మెంట్ మరియు స్కాలర్షిప్లను విడుదల చేసి విద్యార్థులు మరియు యాజమాన్యాలను ఆదుకోవాలని అన్నారు.

## సర్వాయి పాపన్న గౌడ్ తెలంగాణ బహుజన ఆత్మగౌరవానికి, ధీరత్వానికి ప్రతీక

* **ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



ప్రజాస్ఫూర్తి, కాప్రా : సర్వాయి పాపన్న గౌడ్ తెలంగాణ బహుజన ఆత్మగౌరవానికి, ధీరత్వానికి ప్రతీకగా నిలిచారని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా మీర్పేట్ హౌసింగ్ బోర్డు కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయనతో పాటు డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్తో కలిసి హెచ్ బి కాలని ఫస్ట్ ఫేస్ వద్ద గల సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాజకీయ, సామాజిక సమానత్వం కోసం ఆయన చేసిన కృషి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. సర్వాయి పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తిని, పట్టుదలని, ఆయన పోషించిన చారిత్రక పాత్రను అందరూ స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కుల, మతాలకు అతీతంగా ప్రజలకు సమానత్వం కోసం ఆయన చేసిన పోరాటం ప్రశంసనీయమైనదన్నారు. పాపన్న గౌడ్ ఆశయాలను నెరవేర్చేందుకు, తెలంగాణలో వేలాది మంది దళిత, బహుజన నాయకులను ఎదుగదీసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు రామ్ ప్రదీప్, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు పోలేపాక అంజయ్య, విద్యుత్ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ముత్యం వెంకన్న గౌడ్, బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు అనంతుల రామ్ మూర్తి గౌడ్, పొదుపునూరి మల్లేష్ గౌడ్, భూపాల్ గౌడ్, చంద్రయ్య గౌడ్, ఎట్టయ్య గౌడ్, సురేష్ గౌడ్, నవీన్ గౌడ్, అశోక్ గౌడ్, అంజయ్య గౌడ్, బాలరాజ్ గౌడ్, సతీష్ గౌడ్, వెంకటయ్య గౌడ్, సాయిలు గౌడ్, లక్ష్మీనారాయణ గౌడ్, దాస్ గౌడ్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

## చికిత్స పొందుతూ గుర్తుతెలియని వృద్ధుడు మృతి



ప్రజాస్ఫూర్తి, కాప్రా : చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సాయిలు కథనం ప్రకారం...గత నెల 24వ తేదీన కుషాయిగూడ వెంకటేశ్వర స్వామి దేవాలయం సమీపంలో గుర్తు తెలియని వృద్ధుడు అపస్మారక స్థితిలో పడి ఉన్నాడని సమాచారం వచ్చింది. దీంతో వృద్ధుడి ఆచూకీ కోసం పోలీసులు ఆరా తీయగా గత కొద్ది రోజులుగా బిక్షాటన చేస్తూ గుడి సమీపంలోనే నిద్రిస్తున్నాడని స్థానికులు తెలిపారు. అయితే వృద్ధుడి ఆరోగ్య పరిస్థితి క్షీణించి ఉండటంతో 108 సిబ్బంది సాయంతో గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మార్చి 29వ తేదీన వృద్ధుడు మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అలాగే గుర్తు తెలియని వృద్ధుడి ఆచూకీ తెలిసినా, సంబంధికులు ఎవరైనా ఉంటే కుషాయిగూడ పోలీసులను సంప్రదించాలని ఎస్సై సాయిలు తెలిపారు.

## మత్తు మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం



ప్రజాస్ఫూర్తి, కాప్రా: కుషాయిగూడ పోలీస్ సిబ్బంది, యాంటీ డ్రగ్ సోల్జర్స్ వారి సంయుక్త ఆధ్వర్యంలో, తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ డిపార్ట్మెంట్ సహకారంతో, ఈ సి ఐ ఎల్ లోని ఎస్ ఆర్ డిజి హై స్కూల్ లో డ్రగ్స్ మత్తు పదార్థాలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు డ్రగ్స్, సైబర్ క్రైమ్,వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, మానసిక ప్రభావాలు, చట్టపరమైన పరిణామాలు, వాటి ప్రభావాలు, నివారణ చర్యల గురించి అధికారులు వివరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు చురుగ్గా పాల్గొని, వాటికి సంబంధించిన తమ సందేహాలను అడిగి తెలుసుకున్నారు. మత్తు పదార్థాల వ్యసనానికి గురైన వ్యక్తులను సమాజం నుంచి వేరుచేయకుండా, వారికి మానసిక భరోసా కల్పించి పునరావాసం కల్పించాలని సందేశం అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై హనుమాన్ నాయక్, సైబర్ క్రైమ్ రాజు, యాంటీ నార్కోటిక్స్ సోల్జర్స్ మోహన్ పాటిల్, సి ఎచ్ ముక్కంటి, శ్రీశైలం మరాఠి, కాలేజీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల ప్లీనరీ పోస్టర్ ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



ప్రజాస్ఫూర్తి, కాప్రా : గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఆరు గ్యారెంటీల భాగంగా పొందుపరిచిన అంశం ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, 25 వేల పెన్షన్స్ సౌకర్యం చేస్తామని దాదాపు రెండు సంవత్సరాలు కావొస్తున్న ఇంతవరకు ఉద్యమకారుల అంశం పై స్పందించకపోవడం, స్పష్టమైన ప్రకటన రాకపోవడంతో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రేటర్ హైదరాబాద్ పరిధి సికింద్రాబాద్ నియోజకవర్గంలో ఏప్రిల్ 21 న జరగబోయే ప్లీనరీ సమావేశ సంబంధించిన పోస్టర్ రిలీజ్ కార్యక్రమం ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి నివాసంలో బుధవారం ఉదయం కలిసి ప్లీనరీ సమావేశానికి ఆహ్వానిస్తూ.. పోస్టర్ రిలీజ్ కార్యక్రమం జరపగా ఇందుకు అనుగుణంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు తన సహకారం ఎప్పుడూ ఉంటుందని తెలియజేస్తూ ఉద్యమకారుల ప్లీనరీకి హాజరవుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పట్లోల సురేందర్ రెడ్డి,వర్కింగ్ ప్రెసిడెంట్ కొండా స్వామి అధికార ప్రతినిధి తాడూరి గగన్ కుమార్, ఉపాధ్యక్షురాలు జానకి రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ కన్వీనర్ దయానంద్ గంగాపుత్ర, రాష్ట్ర మీడియా ప్రతినిధి దొమ్మాటి కిరణ్ కుమార్ టీయుఎఫ్ ప్రతినిధి భాస్కర్,ఫోరం సభ్యులు నర్సింహ్మా చారి, వీరాచారి తదితరులు పాల్గొన్నారు..

## నిరుపేదలకు వరం.. ఉచిత సన్న బియ్యం

- **మాజీ కౌన్సిలర్ సందగళ్ళ విజయ సతీష్ గౌడ్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెల్ల రేషన్ కార్డుదారులకు ఉచిత సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం నిరుపేదలకు వరం లాంటిదని మాజీ కౌన్సిలర్ సందగళ్ళ విజయ సతీష్ గౌడ్ అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో 14వ వార్డు షాప్ నెంబర్ 41చౌక ధరల దుకాణంలో బుధవారం ఉచిత సన్న బియ్యం పంపిణీ కార్యక్రమన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సందగాల్ల విజయ సతీష్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పేద ప్రజల ప్రభుత్వమని మరోసారి నిరూపించుకుందన్నారు. ప్రజా ప్రభుత్వంలో నిరుపేదలు సైతం మూడు పూటలా సన్న బియ్యం తినాలనే ఉద్దేశంతోనే ఉగాది పర్వదినాన సీఎం రేవంత్ రెడ్డి ఉచిత సన్న బియ్యం కార్యక్రమం చేపట్టారన్నారు. నిరుపేదలు ఉచిత సన్న బియ్యం పథకాన్ని వినియోగించుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వర్కాల రవి, పబ్బు శ్రీకాంత్ వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# భక్తులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా అన్ని శాఖల అధికారులు బాధ్యతగా నిర్వహించాలి

*** తెలంగాణ రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: శ్రీ సీతారామ చంద్రస్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని వీక్షించడానికి భద్రాచలానికి పెద్దఎత్తున భక్తులు తరలి వచ్చే అవకాశం ఉన్నందున భక్తులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా అన్ని శాఖల అధికారులు వారికి అప్పగించిన పనులను బాధ్యతగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్ అన్నారు. బుధవారం నాడు భద్రాచలంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవ వేడుకలు విజయవంతం అవ్వడానికి సంబంధిత శాఖల అధికారుల తరఫున జరుగుతున్న ఏర్పాట్లపై శాఖల వారీగా ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో అత్యంత వైభవోపేతంగా ఎక్కడా లేని విధంగా సీతారాముల వారి కళ్యాణం జరిగేటువంటి పవిత్ర స్థలం మన భద్రాచలం పుణ్యక్షేత్రమని అన్నారు. ఈ క్షేత్రంలో కొన్ని దశాబ్దాల తరబడి సీతారాముల వారి కళ్యాణం ఆనవాయితీగా జరుగుతున్నదని తెలిపారు. కళ్యాణమహోత్సవాన్ని ప్రత్యేకంగా కానీ పరోక్షంగా వీక్షించిన భక్తులకు ఎంతో పుణ్యం వస్తుందని వేదాల్లో చెప్పడం జరిగిందని అన్నారు. పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చే అవకాశం ఉన్నందున పూర్తి స్థాయిలో భక్తులకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మంచినీరు, చలువ పందిళ్లు, వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ఫాగ్ లిస్ట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులు కళ్యాణ వేడుకలు వీక్షించేందుకు 26 సెక్టార్లు ఏర్పాటుతో పాటు ప్రతి సెక్టార్ లో ఎల్ ఈ డి టివిలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కళ్యాణ వేడుకలకు విచ్చేయు భక్తులకు స్వామి వారి కళ్యాణ వేడుకలు వీక్షించి జన్మ జన్మల పుణ్యాన్ని పొందేలా అధికారులు కృషి చేయాలని ఆయన అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణం పట్టాభిషేకం మహోత్సవాన్ని పురస్కరించుకొని దేవస్థానం తరపున మార్చి 30 నుండి ఏప్రిల్ 12 వ తారీకు వరకు బ్రహ్మోత్సవాలు ప్రారంభమైనాయని, కళ్యాణం జరిగే ముందు రోజు స్వామివారి ఎదుర్కోళ్ల కార్యక్రమం ఉంటుందని, భక్తుల సౌకర్యార్థం 75% ఆన్లైన్లో టికెట్లు అందుబాటులో ఉంచామని, భక్తులకు లడ్డు ప్రసాదంతో పాటు మహా ప్రసాదం కూడా అందించడానికి ప్రణాళికలు రూపొందించామని, తలంబ్రాల కౌంటర్లు 80 వరకు ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి ఆర్టీసీ బస్సులో భక్తులకు కేజీ చొప్పున తలంబ్రాలు అందిస్తున్నామని, సేవల ద్వారా ఆర్టీసీ, పోస్ట్ ఆఫీస్ ద్వారా బుక్ చేసుకున్న వారికి ఇండియన్ ప్రకారం అందిస్తామని అన్నారు. సీఎం రాక కోసం మూడు హెలిప్యాడ్లను సిద్ధం చేస్తున్నామని ఆర్డబ్ల్యూఎస్ మెడికల్ డిపార్ట్మెంట్ ద్వారా అక్కడ అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, కళ్యాణం మరియు పట్టాభిషేకం జరిగే రెండు రోజులు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని, జనరేటర్ ను కూడా మిథిలా స్టేడియంలో అందుబాటులో ఉంచుకుంటున్నామని, ఆర్డబ్ల్యూఎస్ ద్వారా భక్తులకు, పార్కింగ్ ఏరియాలలో మరియు సెక్టార్లలో మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు అందిస్తున్నామని, గ్రామపంచాయతీ ద్వారా శానిటేషన్ తో పాటు భద్రాచలంలోని 25 పాయింట్లు మంచినీటి సౌకర్యంతో పాటు, 15చోట్ల 162 టాయిలెట్లు, మూడు మొబైల్ టాయిలెట్లు ఏర్పాట్లు చేశామని, 560 మంది సిబ్బంది అందుబాటులో ఉంచుకున్నామని అన్నారు. భక్తులు గోదావరి లోకి వెళ్లకుండా భారీ కేడింగ్ ఏర్పాటు చేశామని, లైఫ్ జాకెట్లు, లైఫ్ బాల్స్, 20 మంది గజ ఈతగాళ్లను, రిస్క్ బోట్స్ 15, గోదావరిలో ప్రమాద సూచికలను ఏర్పాట్లు చేసి ప్రజలు ఎవ్వరు గోదావరి లోపల వెళ్లకుండా ప్రత్యేక నిగా ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. అగ్నిమాపక శాఖ ద్వారా భద్రాచలం పట్టణంలోని ముఖ్యమైన కూడళ్లలో కళ్యాణం జరుగు ప్రదేశాలలో ఆరు ఫైరింజన్లు ఏర్పాట్లు చేస్తున్నామని, వైద్య ఆరోగ్య శాఖ ద్వారా భద్రాచలం, పర్ణశాల, హెలిపాడ్, వాహనాల పార్కింగ్ స్థలాలలో కలుపుకొని 13 మెడికల్ క్యాంపులు, 05 అంబులెన్సులు, 30 మంది ఫీల్డ్ స్టాఫ్, ఏరియా ఆసుపత్రిలో ప్రత్యేక వార్డు ఐసీయూ 24 గంటలు పని చేసే అంబులెన్స్ తో పాటు ఓఆర్ఎస్ పాకెట్లు అన్ని జబ్బులకు మందులు అందుబాటులో ఉంచుతున్నామని, ఎక్సైజ్ శాఖ ద్వారా 6, 7 తేదీలలో బార్ షాపులు మరియు బెల్టు షాపులు అన్నింటిని క్లోజ్ చేస్తామని, నాలుగు చోట్ల మొబైల్ చెక్పోస్టులు ఏర్పాటు చేసి గట్టిగా పెడుతున్నామని అన్నారు. అధికారులు భక్తులు మాత్రమే స్వామి వారి కళ్యాణం వీక్షించే విధంగా చూడాలని, కుటుంబ సభ్యులకు గానీ, బంధువులకు గాని ప్రాధాన్యత ఇవ్వకూడదని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జేసి వేణుగోపాల్, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్, ఏ ఎస్ పి విక్రాంత్ కుమార్ సింగ్, ఆర్డీవో దామోదర్ రావు, దేవస్థానం ఈవో రమాదేవి ,వివిధ శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శివాలయం వార్షికోత్సవ వేడుకలు



యాదాద్రి భువనగిరి , ప్రజాస్ఫూర్తి : రాజాపేట శివాలయం వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక చేశారు. అనంతరం ఆలయ పూజారి చంద్రశేఖర్ వేద ఆశీర్వాదం ఇచ్చి అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్టు నిర్వాహకులు సునీత మహేందర్ రెడ్డికి సన్మానం చేసి ప్రతిమ గల ఫోటో బహుకరించారు. అనంతరం ఆలయ ట్రస్ట్ వారు మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మాణం కోసం ఆర్థిక సహాయం చేసిన గొంగిడ దంపతులకు వారు ప్రత్యేకంగా ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్, మండల పార్టీ సెక్రటరీ జనరల్ సందిల భాస్కర్ గౌడ్, జలసాధన సమితి మండల ఎర్ర గోకుల జస్వంత్, కోరుకొప్పుల వెంకటేష్ గౌడ్ , మేక వెంకటేశ్వర రెడ్డి, గోపగాని యాదగిరి గౌడ్ ,ఠాకూర్ ధర్మేందర్ సింగ్, రెడ్డబోయిన రాజు,చెరుకు కనకయ్య, వరిమడ్ల బాలకృష్ణ, గంధ మల్ల సురేష్, తదితరులు పాల్గొన్నారు

## వర్షాలు కురవాలని మల్కాపురంలో చండీయాగం



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: వర్షాలు కురవాలని కోరుతూ చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం గ్రామం కెసిఆర్ కాలనీలో బుధవారం చండీయాగం నిర్వహించారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కాలనీవాసులు కోరుకున్నారు. అనంతరం బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు గిర్కాటి నిరంజన్ గౌడ్ ఆధ్వర్యంలో అన్న ప్రసాదం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కెసిఆర్ కాలనీ అధ్యక్షుడు కృష్ణ, కార్యదర్శి దర్శన్, సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి పెద్దిటి బుచ్చిరెడ్డి, మల్కాపురం మాజీ సర్పంచ్ వెల్వర్తి యాదగిరి, ఉపసర్పంచ్ మల్కాజిగిరి కృష్ణ, ఆల్మాస్ పేట కృష్ణ, ఢిల్లీ మాధవరెడ్డి, చిన్నం బాలరాజు, దేవరపల్లి గోవర్ధన్ రెడ్డి, బొమ్మిరెడ్డి వెంకట్ రెడ్డి, కాలనీ ప్రజలు, మల్కాపురం గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర లు ప్రారంభం..



హైదరాబాద్, (ప్రజా స్ఫూర్తి) : జై బాపు, జై భీమ్, జై సంవిదాన్ అంటూ గ్రామ గ్రామాన భారత దేశం స్వరూపాన్ని, రాజ్యాంగ విలువలు చెబుతూ, రాజ్యాంగ స్ఫూర్తి నింపే గొప్ప కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి జై బాపు, జై భీమ్ , జై సంవిధాన్ , జై జగత్ స్టేట్ కోఆర్డినేటర్ గంప వేణుగోపాల్ పాల్గొని సంబంధించిన ప్రచార సామాగ్రి ని గాంధీ భవన్ లో వితరణ చేశారు. మొదటి కిట్ హనుమాన్ స్వామి కి అందజేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.



## హెచ్ సీ యూ భూములను పరిరక్షించాలి

*** జాతీయ రహదారిపై నల్ల బ్యాడ్జిలు ధరించి సిపిఎం నిరసన**

*** బూరుగు కృష్ణారెడ్డి**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: విద్యార్థుల అవసరాలకు ఉపయోగపడవలసిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను.. కార్పొరేట్ శక్తుల చేతుల్లో పడకుండా పరిరక్షించాలి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బూరుగు కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు యూనివర్సిటీ విద్యార్థులకు మద్దతుగా చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో జాతీయ రహదారిపై నల్ల బ్యాడ్జీలు ధరించి బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బూరుగు కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు 1974లో ఆరు సూత్రాల పథకంలో భాగంగా 2500ఎకరాలతో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. ఆనాటి కాంగ్రెస్ విద్యార్థుల భవిష్యత్తును ఆలోచించి విశ్వవిద్యాలయాలకు ఇస్తే, ఈనాటి కాంగ్రెస్ ఆ భూములను కార్పొరేట్ శక్తులకు అప్పగించడం సబబు కాదన్నారు. విద్యార్థుల పోరాటానికి మద్దతుగా వచ్చిన సిపిఎం నాయకులపై కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్, మండల కార్యదర్శి గంగాదేవి సైదులు జిల్లా కమిటీ సభ్యుడు ఎండి పాషా, నాయకులు బండారు నర్సింహ్మ,పొట్ట శ్రీను, ఆకుల ధర్మయ్య, బొడ్డు అంజిరెడ్డి, బాతరాజు దశరథ, ఆర్టీవో పాషా, చీరిక సంజీవరెడ్డి, బోయ యాదయ్య, చీకూరు ఈదయ్య, భావండ్లపల్లి స్వామి, ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీనివాస్, డివైఎఫ్ఐ మధు తదితరులు పాల్గొన్నారు.

## కూకట్ పల్లి కోర్టు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం పదవీ ప్రమాణస్వీకారం




కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : కూకట్ పల్లి కోర్టు బార్ సోసియేషన్ కు గత నెల 27న జరిగిన ఎన్నికల్లో ఎన్నికైన నూతన కార్యవర్గం బుధవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వరుసగా మూడోసారి ఎన్నికైన పి గోవర్ధన్ రెడ్డి మొదటగా పదవీ ప్రమాణం చేశారు. కాగా మొదటిసారి ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన సీనియర్ న్యాయవాది కే భీమయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఏ సుదర్శన్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ ఎన్నికైన హర్షవర్ధన్ రెడ్డి, కోశాధికారిగా ఎన్నికైన సైఫుల్ల షరీఫ్ ల చేత సీనియర్ న్యాయవాది రామచంద్రం పదవీ ప్రమాణస్వీకారం చేయించారు. అదేవిధంగా కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైన అఖిలారావు, సిహెచ్ అర్చన గౌడ్, కళ్యాణి,తన్నీరు శ్రీకాంత్, రామకృష్ణ, పద్మావతి,భాను ప్రకాష్ లు పదవి ప్రమాణం చేశారు. కోర్టులో వసతులను మరింత మెరుగు పరుస్తామని, న్యాయవాదుల సంక్షేమానికి కృషి చేస్తామని బాధ్యతలు స్వీకరించిన అసోసియేషన్ అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుదర్శన్ రెడ్డిలు తెలిపారు. తమ మీద నమ్మకంతో గెలిపించిన సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అందరిని కలుపుకుపోతూ కూకట్పల్లి కోర్టు ఔన్నత్యాన్ని పెంచడానికి పాటుపడతామని, నిబంధనల మేరకు తమ వంతు బాధ్యత నిర్వహిస్తామని తెలిపారు .కాగా ఎన్నికలను సజావుగా నిర్వహించిన చీఫ్ ఎన్నికల అధికారి సుభాష్ గుప్తతో పాటు సహాయ ఎన్నికల అధికారులను కూకట్పల్లి కోర్టు బార్ అసోసియేషన్ మెమొంటోలతో ఘనంగా సత్కరించింది.

## పేదలు సన్న బియ్యాన్ని వినియోగించుకోవాలి

*** ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



ప్రజాస్ఫూర్తి, కాప్రా : సన్న బియ్యం పథకం పేదలకు వరప్రదాయని అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు.బుధవారం కుషాయిగూడ పారిశ్రామిక వాడలోని 94 నెంబర్ రేషన్ షాపులో జిల్లా సివిల్ సప్లై అధికారిణి ఎల్. సరిత తో కలిసి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సన్న బియ్యం పథకాన్ని లాంఛనంగా ప్రారంభించి మహిళలకు బియ్యం అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు కార్మికులు అధికంగా నివసించే ఉప్పల్ నియోజకవర్గంలో ప్రతి ఒక్క కుటుంబం సన్నబియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ అధికారులు టి. సంధ్య, సీనయ్య, చర్లపల్లి కాలనీల సమాఖ్య అధ్యక్షులు ఎంపల్లి పద్మా రెడ్డి, నాయకులు నేమూరి మహేష్ గౌడ్, కుషాయిగూడ పారిశ్రామిక వాడ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు యాదయ్య, విద్యాసాగర్, గంప కృష్ణ, సారా అనిల్ ముదిరాజ్, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, సారా వినోద్ ముదిరాజ్, బివి నరసింహారెడ్డి, కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి పనగట్ల చక్రపాణి గౌడ్, చల్లా వెంకటేష్, యాపపురం రవి, తాళ్ల వెంకటేష్, మేకపోతుల లక్ష్మణ్, బుడంపల్లి వెంకటేష్, బుడంపల్లి రఘుపతి గౌడ్, వెంకటేష్, మహేష్ వివిధ కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, రేషన్ డీలర్లు, ఇతర నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతి వేడుకలు



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: బహుజన రాజ్యాధికార పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న 315వ వర్ధంతి వేడుకలను గౌడ యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం తంగడపల్లి రోడ్డు లోని సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మొగులుల అరాచకాల్ని ఎదురించిన అభినవ శివాజి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మునుగోడు నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్, గౌడ సంఘము అధ్యక్షుడు చింతకింది అంజయ్య గౌడ్, గౌడ సంఘం నాయకులు ఊడుగు శ్రీనివాస్ గౌడ్ , మొగుదల రమేష్ గౌడ్, మునుకుంట్ల సత్యనారాయణ గౌడ్, సందగళ్ల సతీష్, చెరుకు లింగస్వామి, ఊడుగు రమేష్, తొర్పునూరి రవి, బొడిగె బాలకృష్ణ, దిండు భాస్కర్ గౌడ్, ఉష్కాగుల నాగరాజు గౌడ్, మాధగోని శేఖర్, చేవగొని మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## రెడ్డిబావిలో ఉచిత సన్న బియ్యం పంపిణీ ప్రారంభం



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండలం రెడ్డిబాయి గ్రామంలోని రేషన్ దుకాణంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఉచిత సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెల్లరేషన్ కార్డుదారులకు ఉచిత సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రారంభించారన్నారు. ప్రజా ప్రభుత్వం నిరుపేదలకు ఉచిత సన్న బియ్యం పంపిణీ చేపట్టిందన్నారు. ఉచిత సన్న బియ్యం పంపిణీ నిరుపేదలకు వరం లాంటిదన్నారు. అన్ని రేషన్ దుకాణాలలో సన్న బియ్యం ఉచితంగా పంపిణీ జరుగుతుందని, నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పంచశీల స్కూల్ లో పదవ తరగతి విద్యార్థుల గెట్ టూ గేదర్



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : మూసా పేట లోని పంచశీల స్కూల్ లో బుధవారం పదవ తరగతి విద్యార్థుల గెట్ టూ గేదర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెట్ పంచశీల శ్రీనివాస్ మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు ముగిసిన తరువాతే అసలైన జీవితం ప్రారంభవుతుందన్నారు. ఉన్నతమైన లక్ష్యం ఏర్పాటు చేసుకుని, లక్ష్య సాధన దిశగా నడవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి రేషన్ షాప్ లో భారత ప్రధానమంత్రి మోడీ చిత్రపటం ఉంచాలి

*** యాదగిరిగుట్ట బిజెపి పట్టణ అధ్యక్షులు కర్ర ప్రవీణ్**



యాదాద్రి భువనగిరి , ప్రజాస్ఫూర్తి : పట్టణం లోని యాదగిరిపల్లి , గాంధీ నగర్ లో రేషన్ షాపులను బుధవారం పట్టణ బిజెపి శాఖ ఆధ్వర్యంలో పరిశీలించడం జరిగింది ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు కర్ర ప్రవీణ్ మాట్లాడుతూ నిన్నటి నుండి ప్రారంభించబడినటువంటి సన్న బియ్యం పథకాలను రేషన్ షాపుల్లో ఎలా ఉన్నాయో పరిశీలించడం జరిగింది అలాగే ప్రతి రేషన్ షాప్ లో ప్రధానమంత్రి మోడీ చిత్రపటం ఉంచాలని డీలర్ కి తెలియచేయడం జరిగింది .నిన్న యాదగిరిగుట్టలో ఏర్పాటు చేసినటువంటి కాంగ్రెస్ మీటింగ్ లో భాగంగా రాష్ట్ర మంత్రివర్యులు కోమటిరెడ్డివెంకట్రెడ్డి చేసిన వ్యాఖ్యలను పూర్తిగా ఖండిస్తున్నాం కేంద్రం వాటా లేదని వారు వ్యాఖ్యానించడం హాస్యస్పదంగా ఉంది ఈ యొక్క సన్న బియ్యం పథకంలో పదివేల కోట్లు కేంద్రం ఇస్తుందని మీరు ఇచ్చే కేవలం 2000 కోట్లు మాత్రమేనని ఇది తెలియకుండా మీరు మాట్లాడడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు దాంతోపాటు లబ్ధిదారుల్లో మాట్లాడి బియ్యం ఎలా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు కేంద్రం యొక్క వాటా ఒక్కరికి 5 కేజీలను రాష్ట్ర యొక్క వాటా ఒక్కరికు ఒక కిలో మాత్రమే లబ్ధిదారులకు తెలియజేయడం జరిగింది దాంతోపాటు మన ప్రియతమ ప్రధాని నరేంద్ర మోడీ ఏ ఒక్క పౌరుడు ఆకలి తో ఉండొద్దు అనే ఉద్దేశ్యం తో సుమారు ఐదు సంవత్సరాల నుండి ఏ రాష్ట్ర ప్రభుత్వాల వాటా లేకుండా పూర్తిగా పేదలకు బియ్యం ఉచితంగా అందిస్తున్నారు అదే సంకల్పంతో తెలంగాణ రాష్ట్రంలో దొడ్డు బియ్యం కావడం చేత చాలామంది వివిధ మార్గాల ద్వారా వాటిని అమ్మే ప్రయత్నం చేస్తున్నారు అది తెలుసుకొని సన్నబియ్యం పంపిణీ చేయడానికి సిద్ధమైంది అందులో భాగంగా 10000 కోట్ల రూపాయలను కూడా కేంద్ర ప్రభుత్వం దీనికి కేటాయించింది దీనికి పూర్తిగా హర్షిస్తున్నామని అక్కడ ఉన్న లబ్ధిదారులు తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ మెంబర్ రచ్చ శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి కాదూరి అచ్చయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శి ఆకుల చంద్రమౌళి ,ఓబీసీ మోర్చా అధ్యక్షులు మందోజు నరేష్ , బీజేవైఎం పట్టణ అధ్యక్షులు బోడ బుచ్చిబాబు ,ఉపాధ్యక్షులు వాల్మీకి అజయ్ ,ప్రధాన కార్యదర్శి పలుగుల సురేష్ ,సీనియర్ నాయకులు నల్ల వాసుదేవ రెడ్డి అలేటి కర్ణ , కర్రే లక్ష్మయ్య , చిత్తర్ల కృష్ణ ,నరేష్ ,సుధా గాని శివ ,శ్రావణ్ ,హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో ప్రభుత్వ భూములకు రక్షణ కరువైపోయింది

*** సిపిఎం మండల కార్యదర్శి కీలుకానీ లక్ష్మణ్**




కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ భూములకు రక్షణ కరువైపోయిందని సిపిఎం మండల కార్యదర్శి కీలుకానీ లక్ష్మణ్ అన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల రక్షణ కోసం పోరాడుతున్న ,హెచ్సియు విద్యార్థులను, సిపిఎం నాయకుల అక్రమ అరెస్టులకు నిరసనగా షాపూర్ నగర్ లో రాస్తారోకో సిపిఎం కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం షాపూర్ నగర్ రైతు బజార్ దగ్గర నుండి సాగర్ హోటల్ చౌరస్తా వరకు నిరసన ర్యాలీ , రాష్ట్ర రేవంత్ రెడ్డి ప్రభుత్వ నిర్బంధఖండకు వ్యతిరేకంగా రాస్తారోకో ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం మండల కార్యదర్శి కీలుకానీ లక్ష్మణ్ మండల కమిటీ సభ్యులు ఈ దేవదానం పాల్గొని మాట్లాడుతూ విచ్చలవిడిగా భూములను ఆక్రమించుకుంటున్నారు, చివరికి విద్యాసంస్థల భూములను కూడా వదలడం లేదన్నారు. ఉత్తర భారత దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన యూనివర్సిటీ లలో హెచ్సీయు ఒకటి అలాంటి యూనివర్సిటీ భూములను గత కొద్ది రోజులుగా కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు వేలం వేసి అమ్మే ఆలోచనలో ఉందని యూనివర్సిటీ విద్యార్థులు ఆ భూములను కాపాడుకోవాలన్నారు. అక్కడ ఉన్న ప్రకృతి ని రక్షించుకోవాలని పక్షులు,జంతువులకు రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో సామరస్యంగా నిరసన కార్యక్రమం తెలియజేస్తే ప్రభుత్వము పోలీస్ బలగాలతో విద్యార్థులను చాలా కిరాతకంగా ఈడ్చుకుంటూ పోలీస్ వాహనాలలో ఎక్కించుకొని అక్రమంగా అరెస్టు చేసి కేసులు పెట్టింది, అరెస్టు చేసిన విద్యార్థులని వెంటనే విడుదల చేయాలన్నారు. విద్యార్థులకు మద్దతుగా యూనివర్సిటీ భూముల రక్షణ కోసం యూనివర్సిటీ వద్ద ధర్నాకు బయలుదేరిన సిపిఎం నాయకుల్ని రాష్ట్రవ్యాప్తంగా అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్లో పెట్టడం దుర్మార్గమని అన్నారు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వాగ్దానంలో ఇచ్చిన ఏడవ గ్యారెంటీ ప్రజాస్వామ్య పునరుద్ధరణ ఏమైందని అన్నారు ప్రభుత్వ భూముల్ని పేదల సంక్షేమం కోసం కాకుండా కార్పొరేట్ శక్తుల లాభాల కోసం కేటాయించడం, యూనివర్సిటీల భూములు కొల్లగొట్టి రానున్న కాలంలో ప్రభుత్వ విద్యను ప్రశ్నార్థకం చేయడమేనని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేసి యూనివర్సిటీ భూముల వేలాన్ని ఆపాలని యూనివర్సిటీ భూముల రక్షణ కోసం ఆందోళన చేస్తున్న విద్యార్థులను వారికి మద్దతు తెలుపుతున్న సిపిఎం నాయకుల అక్రమ అరెస్టులను ఆపాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు, పసుల అంజయ్య, ఢీ కరుణాకర్ రావుల స్వాతి, పార్టీ నాయకులు మల్లారెడ్డి పాషా, ఆంజనేయులు, దుర్గా నాయక్ , కే, శీను, మధు, యువజన సంఘం నాయకులు ఆది నాగరాజు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## మూసీ పరిసరాల్లో నిర్మాణాలపై తెలంగాణ సర్కార్ కీలక ఉత్తర్వులు

హైదరాబాద్: మూసీ పరిసరాల్లో నిర్మాణాల నియంత్రణకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మూసీ పరిసరాల్లో ప్రణాళికా రహిత నిర్మాణాలు చేపట్టకుండా చర్యలు తీసుకుంది. ఇందుకోసం నలుగురు సీనియర్ అధికారులతో కమిటీ ఏర్పాటు చేసింది. మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జేఎండీ, డీటీసీపీ, జీహెచ్ఎంసీ చీఫ్ ప్లానర్, హెచ్ఎండీఏ ప్లానింగ్ డైరెక్టర్ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. మూసీకి 50 మీటర్ల వరకు బఫర్‌జోన్‌లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని ఉత్తర్వులు జారీ చేసింది. 50 నుంచి 100 మీటర్ల వరకు కొత్తగా ఎలాంటి అనుమతులు ఇవ్వరాదని ఉత్తర్వుల్లో పేర్కొంది. మాస్టర్ ప్లాన్ ఖరారయ్యే వరకు, కమిటీ క్లియర్ చేసేంత వరకు ఏవిధమైన కొత్త అనుమతులు ఇవ్వకూడదని ప్రభుత్వం ఆదేశించింది. మూసీకి 100 మీటర్ల వరకు ప్రభుత్వ పనులు చేపట్టాలన్నా ముందస్తు అనుమతి తప్పనిసరని స్పష్టం చేసింది.

## శభాష్ 'భేటీ'

*** "ప్రధాని పిలుపుతో మొక్కలు నాటుతున్న చిన్నారి నైనిక రజవా**

*** 'ఏక్‌పేడ్.. మా కె నామ్' నినాదంతో స్ఫూర్తి**

*** పచ్చదనాన్ని పెంపొందించేందుకు హరితదీక్ష**

*** నైనిక కృషిని అభినందిస్తున్న జిల్లా ప్రముఖులు**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ఏక్ పేడ్.. మా కె నామ్' నినాదంతో దేశ ప్రధాని నరేంద్రమోడీ ఇచ్చిన పిలుపుకు చైతన్యవంతురాలైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని రామవరం ప్రాంతానికి చెందిన నైనిక రజువ మొక్కలు నాటుతూ మరికొంత మందిలో స్ఫూర్తి నింపుతోంది. కొత్తగూడెం సెయింట్ మేరీస్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న నైనిక రజువా తల్లిదండ్రులు దశరథ్ రజువా, ఝాన్సీల ప్రోత్సాహంతో మొక్కలు నాటడాన్ని అలవాటుగా చేసుకుంది. పర్యావరణాన్ని పరిరక్షించాలి, పచ్చదనాన్ని పెంపొందించాలనే ఆకాంక్షతో గత ఏడాది హరితదీక్షను చేపట్టిన నైనిక అతి కొద్ది కాలంలోనే వందల సంఖ్యలో మొక్కలు నాటింది. కుటుంబ సభ్యుల పుట్టినరోజులు, పెళ్లిరోజులు ఇతర శుభకార్యాలను పురస్కరించుకుని స్వయంగా మొక్కలు నాటుతూ, పలువురిచే నాటింపచేస్తూ 'శభాష్ భేటీ' అన్పించుకుంటుంది. ప్రకృతిని కాపాడితే అది మనల్ని కాపాడుతుందని నమ్మిన నైనిక పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, భవిష్యత్తులో సంభవించే ప్రకృతి విపత్తులపై తన తోటి విద్యార్థులు, స్థానిక పిల్లలకు అవగాహన కల్పిస్తూ వారిలోనూ మొక్కలు నాటాలనే ఆకాంక్షను బలంగా నాటుతోంది. ఈ సందర్భంగా పలువురి ప్రశంసలను సైతం అందుకుంటోంది నైనిక. భద్రాద్రి కొత్తగూడెం జల్లా అధికారులు, పట్టణ ప్రముఖులు నైనిక చేస్తున్న కృషిని ప్రశంసించి అభినందించారు.

*** ప్రకృతి ఆరోగ్య మహాసభల్లో అవార్డు..**

ఇటీవల కొత్తగూడెం పట్టణంలో పెద్దఎత్తున నిర్వహించిన ప్రకృతి ఆరోగ్య మహాసభల్లో భాగంగా పర్యావరణ పరిరక్షణ కోసం హరిత దీక్ష చేపట్టిన నైనిక రజువాను పలువురు అభినందించి అవార్డును అందించారు. మహాసభల సమయంలో నైనిక రజువా అందుబాటులో లేకపోవడంతో గురువారం ప్రకృతి ప్రేమికుడు మొక్కల రాజశేఖర్ (కొత్తూరు రాజశేఖర్) స్వయంగా నైనిక వద్దకు వచ్చి అవార్డు ప్రదానం చేసి మొక్కను అందించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ నైనిక రజువా చేస్తున్న కృషిని మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ప్రముఖ కవి జయరాజు, డాక్టర్ రమేష్‌బాబు, మొక్కల వెంకటయ్య, జాతీయ జలసాధన సమితి అధ్యక్షులు దుశర్ల సత్యనారాయణలు అభినందించారని వివరించారు. భవిష్యత్తులోనూ ఇదే విధంగా పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు తమవంతు సహకారాన్ని నైనికకు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా గింజలు సేకరించి నాటాలని, వేసవిలో మట్టి చిప్పలలో నీటిని నింపిపెట్టాలి సూచించారు. ప్లాస్టిక్ బాటిల్స్‌లో కాకుండా స్టీల్ బాటిల్స్‌లో నీరుతాగాలని, తద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చన్నారు.

*** ప్రధాని పిలుపుతో స్ఫూర్తి పొందాను: నైనిక రజువా, హరితదీక్షాపరురాలు**

'ఏక్ పేడ్.. మా కె నామ్' అని మన ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఇచ్చిన పిలుపుతో స్ఫూర్తి పొంది గత ఏడాది హరిత దీక్ష తీసుకున్నాను. నా తల్లిదండ్రులు దశరథ్ రజువా, ఝాన్సీల సహకారంతో ఇప్పటివరకు వివిధ ప్రాంతాల్లో మొక్కలు నాటాను. నా తోటి విద్యార్థులు, పిల్లలకు కూడా మొక్కలు నాటడంపై అవగాహన కల్పిస్తున్నాను. భవిష్యత్తులోనూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉద్యమంలా ముందుకు తీసుకువెళ్తాను

## ఆటిజంతో బాధపడుతున్న చిన్నారుల తల్లిదండ్రుల కోసం ప్రత్యేక పుస్తకం తీసుకువచ్చిన ముగ్ధ కల్రా

హైదరాబాద్ 02 ఏప్రిల్ (ప్రజా స్ఫూర్తి : ఆటిజం పట్ల అవగాహన మరియు అంగీకార నెలగా ఏప్రిల్ ను నిర్వహిస్తోన్న వేళ, సమ్మిళిత విధానాలు, ముందస్తు జోక్యం, సంరక్షకుల శ్రేయస్సు వంటి అంశాల పట్ల ప్రతి ఒక్కరి దృష్టి మళ్లింది. 1970లో ఆటిజం సొసైటీ ఆఫ్ అమెరికా ప్రారంభించగా, ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవంగా ఏప్రిల్ 2 ను (ఐక్యరాజ్యసమితి గుర్తించింది) ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తున్నారిప్పుడు. ఈ సంవత్సరం, " వ్యత్యాసాలు వేడుక చేయండి" నేపథ్యం తో ఈ దినోత్సవం నిర్వహిస్తున్నారు., ఇళ్ళు, పాఠశాలలు,



కార్యాలయాలు మరియు సమాజాలలో న్యూరో వైవిధ్యాన్ని స్వీకరించడాన్ని, సమ్మిళిత పర్యావరణ వ్యవస్థ సృష్టిని ఇది ప్రోత్సహిస్తుంది. ఈ దినోత్సవం పురస్కరించుకుని, ముగ్ధ కల్రా రాసిన "ఐ సీ యు, ఐ గెట్ యు: ది సెల్ఫ్‌కేర్ గైడ్ ఫర్ స్పెషల్ నీడ్స్ పేరెంట్స్" అనే సంచలనాత్మక పుస్తకంను ఆవిష్కరించింది బుకోస్మియా సంస్థ. బెంగళూరులో జరిగిన ఇండియా ఇంక్లూజన్ సమ్మిట్, ఇండియన్ న్యూరో డైవర్సిటీ సమ్మిట్ సందర్భంగా విడుదల చేయబడిన ఈ పుస్తకం కుటుంబాలు, విద్యావేత్తలు మరియు యజమానులకు అత్యుత్తమ సహచరునిగా నిలువనుందని ముగ్ధ చెప్పారు. ఈ పుస్తకం వైవిధ్యభరితమైన పిల్లల తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న భావోద్వేగ, ఆర్థిక, సామాజిక సవాళ్లను చర్చిస్తుంది. ముఖ్యంగా భారతదేశంలో, వ్యవస్థాగత మద్దతు సరిపోదని ముగ్ధ చెబుతూ తన వ్యక్తిగత అనుభవాలను కూడా జోడించారు. ఆచరణాత్మక వ్యూహాలు, పరిజ్ఞానం అందిస్తూనే, సంరక్షకులు తమ శ్రేయస్సుకు ప్రాధాన్యత ఇవ్వమని ఈ పుస్తకం ప్రోత్సహిస్తుంది . "కార్పొరేట్లు సంరక్షకులను నియమించుకున్నప్పుడు, వారు మొత్తం కుటుంబాలను మరింత స్థిరమైన, సంతృప్తికరమైన జీవితాలను గడపడానికి శక్తివంతం చేస్తారని ముగ్ధ వివరించారు.

## హెచ్‌సియూ భూముల విషయంలో తప్పుడు ప్రచారం తగదు

*** కాంగ్రెస్ పార్టీపై బురద చల్లే ప్రయత్నం చేస్తే సహించేది లేదు**

*** కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కోనేరు సత్యనారాయణ**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కంచె గచ్చిబౌలిలో అంతర్జాతీయ సంస్థలు తెచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సిఎం రేవంతర్ రెడ్డి ప్రయత్నం చేస్తుందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కోనేరు సత్యనారాయణ అన్నారు. కొంత మంది రాజకీయ కుట్రతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. యూనివర్సిటీలో ఇంచు భూమిని సైతం ముట్టుకోమని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసిందన్నారు. చుంచుపల్లి మండలంలోని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అబద్దాల మీద బతుకుతున్న కొన్ని రాజకీయ పార్టీలు ప్రజలకు తప్పుడు సమాచారం ఇస్తూ కాంగ్రెస్ పార్టీపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. 400 ఎకరాల యూనివర్సిటీ భూమిని ప్రభుత్వం లాగేసుకుంటున్నట్లు దుష్ప్రచారం జరుగుతోందని, వాస్తవాలు ప్రజలకు తెలియాలని స్పష్టం చేశారు. 2004లో 400ఎకరాలను ఐఎంజీ భారత్‌కు అప్పటి ప్రభుత్వం అప్పగించిందని, దానికి బదులుగా అప్పటి ప్రభుత్వం గోపన్‌పల్లిలోని 397 ఎకరాలు హెచ్‌సియూకి ఇచ్చిందని గుర్తుచేశారు. బిల్లీ రావుకు చెందిన ఐఎంజీ భారత్ అనే ఫ్రాడ్ కంపెనీకి ఇచ్చిన భూ ఒప్పందాన్ని 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందని అన్నారు. ఆ సంస్థ కోర్టుకు వెళ్లగా ప్రజల ఆస్తి ప్రజలకే ఉండాలని ప్రభుత్వం పోరాటం చేసిందన్నారు. సిఎం రేవంత్ ప్రభుత్వం కొట్లాడి కేసు గెలిచిందని వెల్లడించారు. బిఆర్ఎస్ నాయకుడు వనమా స్థాయి మరిచి మాట్లాడుతున్నారని, రౌడీలు ఎవరో తెలుసని, అవినీతి, అక్రమాలకు పాల్పడ వాళ్ళ గురించి ప్రజలకు తెలుసని ఎద్దేవా చేశారు. దళితబంధు పేరిట రాంబంధువుగా మారి అమాయక దళిత ప్రజలను మోసం చేసిన చరిత్ర మీదని విమర్శించారు. కొడుకు అక్రమాలకు కుటుంబాలే బలయ్యాయని, కాంగ్రెస్ భిక్షతోనే నేడు ఈ స్థాయిలో ఉన్నారని మరవకూడదని హితవు పలికారు. సరిగ్గా నాలుగు అడుగులు నడవలేరు, నాలుగు మాటలు మాట్లాడలేని స్థితిలో ఉన్న మనమా సిఎం రేవంత్ రెడ్డి పై వ్యాఖ్యలు చేయడం విడ్డూరంగా ఉందంటూ ఎద్దేవ చేశారు. ఇక మీద కాంగ్రెస్ పార్టీ పై బురద జల్లే ప్రయత్నం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు దేవిప్రసన్న, రైల్వే బోర్డు మెంబర్ వై శ్రీనివాస్ రెడ్డి, మండే హనుమంతరావు, జిల్లా యువనజ కాంగ్రెస్ అధ్యక్షుడు చీకటి కార్తీక్, నియోజకవర్గ అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి, నాయకులు సుందర్‌రాజు, రావి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..

### సెన్సెక్స్ 600 పాయింట్లు జంప్..!



**ముంబై:** రెండురోజుల తర్వాత దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. బ్యాంకింగ్, ఐటీ స్టాక్స్ రాణించాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌తో పాటు మరికొన్ని దేశాలపై సుంకాలు ప్రకటించనునున్న నేపథ్యంలోనూ ర్యాలీ కొనసాగడం విశేషం. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 76,146.28 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 76,064.94 పాయింట్ల కనిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్.. 76,680.35 పాయింట్ల గరిష్ఠానికి పెరిగింది. చివరకు 592.93 పాయింట్లు పెరిగి 76,617.44 వద్ద ముగిసింది. నిఫ్టీ 166.65 పెరిగి 23,332.35 వద్ద స్థిరపడింది. దాదాపు 2755 షేర్లు లాభపడగా.. 1,048 పతనమయ్యాయి. ట్రంప్ టారిఫ్ ప్లాన్ ప్రకటించ తర్వాత ప్రపంచ వాణిజ్యం మొత్తం మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ట్రంప్ టారిఫ్ ప్లాన్ల రూపురేఖలు ఎలా ఉంటాయో చూడాల్సిందేనని మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు. మనకు ఇబ్బందికరంగా మారింతే తిరోగమనాన్ని చూడాల్సి వస్తుందని.. ట్రస్ట్ మ్యూచువల్ ఫండ్ సీఈవో సందీప్ బాగ్లా పేర్కొన్నారు. రంగాలవారీగా, నిఫ్టీ ఎఫ్ఎంసీజీ, బ్యాంక్, ఐటీ, ఆటో ఏప్రిల్ షేర్లు ఒకశాతం వరకు పెరిగాయి. హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ ఒకశాతంపైగా పెరిగాయి. నిఫ్టీ ఇన్‌ఫ్రా, మెటల్, ఫార్మా, పీఎస్‌యూ బ్యాంక్ కూడా అదే బాటలో కొనసాగాయి. నిఫ్టీలో టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్, జొమాటో (ఎటర్నల్), టైటాన్ కంపెనీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, టెక్ మహీంద్రా షేర్లు అత్యధికంగా లాభపడ్డాయి. భారత్ ఎలక్ట్రానిక్స్, అల్ట్రాటెక్ సిమెంట్, పవర్ గ్రిడ్ కార్ప్, నెస్లే, హిందాల్కో షేర్లు నష్టపోయాయి.

## ఫోర్బ్స్ బిలియనీర్ల జాబితా..

### మళ్లీ టాప్ ప్లేస్ ఎలాన్ మస్క్‌దే..



**న్యూయార్క్:** ఫోర్బ్స్ బిలియనీర్ల జాబితా 2025 విడుదలైంది. ఈ జాబితాలో ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మరోసారి తొలిస్థానంలో నిలిచారు. 342 బిలియన్ డాలర్ల నికర విలువతో టాప్ ప్లేస్ దక్కించుకున్నారు. గతేడాదితో పోలిస్తే మస్క్ సంపద 147 బిలియన్ డాలర్లు పెరిగింది. మస్క్ తర్వాత ఫేస్‌బుక్ వ్యవస్థాపకుడు మార్క్ బుకర్‌బర్గ్ రెండో స్థానంలో నిలిచారు. ఆయన నికర విలువ 216 బిలియన్ డాలర్లుగా ఉంది. అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ 215 బిలియన్ డాలర్ల నికర విలువతో మూడో స్థానంలో నిలిచారు.

ఇక ఈ జాబితాలో యూఎస్ టాప్‌లో ఉంది. ప్రస్తుతం అమెరికాలో 902 మంది సంపన్నులు ఉన్నారు. ఆ తర్వాత చైనాలో 516 మంది బిలియనీర్లు ఉండగా.. భారత్ 205 మంది బిలియనీర్లతో మూడో స్థానంలో నిలిచింది. ఆసియాలోనే అత్యంత సంపన్నుడు, ప్రముఖ వ్యాపారవేత్త, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ 92.5 బిలియన్ డాలర్ల సంపదతో ఈ జాబితాలో 18వ స్థానంలో నిలిచారు. మరో భారతీయుడు గౌతమ్ అదానీ 56.3 బిలియన్ డాలర్ల సంపదతో 28వ స్థానంలో ఉన్నారు. ఇక ఈసారి 288 మంది కొత్త వ్యక్తులు ఫోర్బ్స్ జాబితాలో చేరారు. వీరిలో పలువురు హాలీవుడ్ చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖులు ఉన్నారు.

## ఉపసంహరించుకున్న రూ.2వేల నోట్లపై ఆర్‌బీఐ కీలక ప్రకటన..!




**న్యూఢిల్లీ:** రద్దు చేసిన రూ.2000నోట్లు మంగళవారం నాటికి 98.21 శాతం తిరిగి బ్యాంకులకు చేరాయని.. ఇంకా రూ.6,366 కోట్ల విలువైన నోట్లు మాత్రమే ప్రజల వద్ద ఉన్నాయని రిజర్వ్ బ్యాంక్ ఇండియా స్పష్టం చేసింది. 2023 మే 19న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.2వేల నోట్ల చెలామణిలో నుంచి ఉపసంహరించుకుంటున్నట్లు తెలిపింది. నోట్లను వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించిన రోజు వరకు రూ.2వేల నోట్ల మొత్తం విలువ రూ.3.56లక్షల కోట్లుగా రిజర్వ్ బ్యాంక్ పేర్కొంది.

మార్చి 2025తో ముగిసిన ఆర్థిక సంవత్సరం తర్వాత రూ.6,366 కోట్లు ఇంకా మార్కెట్‌లోనే ఉన్నాయని.. ఇప్పటి వరకు నోట్లలో 98.21 శాతం తిరిగి వచ్చినట్లు రిజర్వ్ బ్యాంక్ పేర్కొంది. రద్దు చేసిన నోట్లను 2023 అక్టోబర్ 7 వరకు అన్ని బ్యాంకుల్లో రూ.2వేల నోట్లను డిపాజిట్ చేయడం లేదంటే మార్చుకునేందుకు అవకాశం కల్పించింది. ఆ తర్వాత ఆర్‌బీఐ రూ.2వేల నోట్లను సేకరిస్తున్నది. సామాన్య ప్రజలు దేశంలోని ఏ పోస్టాఫీసు నుంచైనా, ఇండియన్ పోస్ట్ ద్వారా భారతీయ రిజర్వ్ బ్యాంక్ కార్యాలయాల్లోనూ రూ.2000 నోట్లను పంపి తమ బ్యాంకు ఖాతాలో జమ చేసుకునే అవకాశం ఇస్తున్నది. రూ. 2000 బ్యాంకు నోట్లు చట్టబద్ధమేనని ఆర్‌బీఐ పేర్కొంది.

## ఐపీఎల్‌లో బెంగళూరుకు

# తొలి ఓటమి

### ఎనిమిది వికెట్ల తేడాతో ఆర్‌సీబీని చిత్తుచేసిన గుజరాత్ టైటాన్స్

**బెంగళూరు:** ఐపీఎల్‌లో రెండు వరుస విజయాలతో జోరుమీదున్న రాయస్థాన్ రాయల్స్‌కు గుజరాత్ టైటాన్స్ బ్రేకులు వేసింది. బెంగళూరు వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు ఆర్‌సీబీని గుజరాత్ ఎనిమిది వికెట్ల తేడాతో చిత్తు చేసింది. ఆర్‌సీబీ విధించిన 170 పరుగుల లక్ష్యాన్ని జీటీ 17.5 ఓవర్లలోనే లక్ష్యాన్ని చేరుకుంది. అటు బౌలింగ్, ఇటు బ్యాటింగ్‌లో అద్భుతంగా రాణించిన శుభ్‌మన్ గిల్ సేన ఐపీఎల్‌లో రెండో విజయాన్ని నమోదు చేసింది. బ్యాటింగ్‌లో సాయి సుదర్శన్, జోస్ బట్లర్, రూథర్‌ఫోర్డ్ రాణించడంతో



గుజరాత్ రెండు వికెట్లు నష్టపోయి విజయాన్ని అందుకున్నది.

బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచిన జీటీ కెప్టెన్ గిల్ బౌలింగ్ ఎంచుకున్నాడు. తొలుత బ్యాటింగ్ చేసిన రజత్ పాటిదార్ నేతృత్వంలోని జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఎనిమిది వికెట్ల నష్టానికి కేవలం 169 పరుగులు మాత్రమే చేయగలిగింది. గుజరాత్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో పరుగులు చేయడం కష్టంగా మారింది. హైదరాబాదీ బౌలర్ మహ్మద్ సిరాజ్, సాయి కిశోర్, అర్షద్ ఖాన్, ప్రసిద్ధ్ కృష్ణ అద్భుతంగా బౌలింగ్ చేయడంతో ఆర్‌సీబీ బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు.

ఒక దశలో 42 పరుగులకే నాలుగు కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో కూరుకుపోగా.. ఆర్‌సీబీని లివింగ్ స్టోన్ (54), జితేశ్ శర్మ (33) ఆదుకున్నారు. చివరలో టిమ్ డేవిడ్ సిక్సర్లు, ఫోర్లతో విరుచుకుపడడంతో బెంగళూరు ఆమాత్రం స్కోర్ చేయగలిగింది. ఫిల్ సాల్ట్ (14), విరాట్ కోహ్లీ (7), దేవ్‌దత్ పడిక్కల్ (4), రజత్ పాటిదార్ (12), కృణాల్ పాండ్యా (5) పరుగులు మాత్రమే చేయగలిగారు. మహ్మద్ సిరాజ్‌కు మూడు వికెట్లు పడగొట్టగా.. సాయిసుదర్శన్‌కు రెండు, అర్షద్ ఖాన్, ప్రసిద్ధ్ కృష్ణ, ఇషాంత్ శర్మకు తలో వికెట్ దక్కింది.

బెంగళూరు నిర్దేశించి 170 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్‌కు ఓపెనర్లు శుభ్‌మన్ గిల్, సాయిసుదర్శన్ శుభారంభం అందించారు. ఇద్దరు తొలి వికెట్‌కు 33 పరుగుల భాగస్వామ్యాన్ని అందించారు. 14 బంతుల్లో ఒక ఫోర్, సిక్సర్‌తో 14 పరుగులు చేసిన శుభ్‌మన్ గిల్ భువనేశ్వర్ కుమార్ బౌలింగ్‌లో లివింగ్ స్టోన్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఆ తర్వాత సాయిసుదర్శన్, జోస్ బట్లర్ కలిసి గుజరాత్‌ను విజయం నడిపించారు. ఇద్దరు కలిసి రెండో వికెట్‌కు హాఫ్ సెంచరీ భాగస్వామ్యాన్ని నమోదు చేశారు. ఆ తర్వాత 36 బంతుల్లో ఏడు ఫోర్లు, సిక్సర్ సహాయంతో 49 పరుగులు చేసి అవుట్ అయ్యాడు. దాంతో తృటిలో హాఫ్ సెంచరీ మిస్ చేసుకున్నాడు.

ఆ తర్వాత జోస్ బట్లర్ రూథర్‌ఫోర్డ్‌తో కలిసి గుజరాత్‌కు విజయాన్ని అందించాడు. 39 బంతుల్లో (ఆరు సిక్సర్లు, ఐదు ఫోర్ల)తో అజేయంగా 73 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. రూథర్‌ఫోర్డ్ 18 బంతుల్లో మూడు సిక్సర్లు, ఫోర్ సహాయంతో 30 పరుగులు చేశాడు. బెంగళూరు బౌలర్లలో భువనేశ్వర్ కుమార్‌కు ఒకటి, జోష్ హాజిల్‌వుడ్ ఒక వికెట్ దక్కింది. ఇక ఈ విజయంతో ఐపీఎల్ పాయింట్ల పట్టికలో గుజరాత్ టైటాన్స్ నాలుగో స్థానానికి చేరింది. ఆర్‌సీబీ మూడోస్థానానికి పడిపోగా.. పంజాబ్ కింగ్స్ అగ్రస్థానంలో ఉన్నది. రెండు విజయాలతో పంజాబ్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల ఖాతాలో నాలుగేసి పాయింట్లు ఉండగా.. రన్‌రేట్ పరంగా మెరుగ్గా ఉండడంతో పంజాబ్ అగ్రస్థానంలో ఉన్నది. ఇక ఐపీఎల్‌లో భాగంగా గురువారం కోల్‌కతా నైట్‌రైడర్స్ %-% సన్ రైజర్స్ హైదరాబాద్ మధ్య కోల్‌కతా వేదికగా మ్యాచ్ జరుగనున్నది.



## ముంబైని వదిలేసిన

# యశస్వి జైస్వాల్

### కొత్త జట్టుతో దేశవాళీ క్రికెట్

**ముంబై:** దేశవాళీ క్రికెట్‌లో కొత్త జట్టుతో యశస్వి జైస్వాల్ ఆడనున్నాడు. 2024-2025 సీజన్‌లో ముంబై జట్టు తరపున జైస్వాల్ ఆడిన విషయం తెలిసిందే. ఇటీవల ముగిసిన రంజీ ట్రోఫీ టోర్నీలో ముంబై తరపున జైస్వాల్ ప్రాతినిధ్యం వహించాడు. అయితే తన కెరీర్‌లో భారీ మార్పు చేసుకున్నాడతను. అండర్-19 క్రికెట్ ఆడుతున్న నాటి నుంచి ముంబై తరపున ఆడిన ఆ టీమిండియా ఓపెనర్ ఇప్పుడు దేశవాళీ క్రికెట్‌లో గోవా తరపున ఆడేందుకు డిసైడ్ అయ్యాడు. వచ్చే సీజన్ నుంచి అతను గోవా తరపున ఆడనున్నాడు. దీని కోసం అతను ముంబై క్రికెట్ అసోసియేషన్ నుంచి నో ఆబ్జెక్షన్ సర్టిఫికేట్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. స్టేట్ క్రికెట్‌ను మార్చుకోనున్నట్లు అతను తెలిపాడు. ఇటీవల ముంబై ప్లేయర్లు అర్జున్ టెండూల్కర్, సిద్దేశ్ లాడ్‌లు.. స్వరాష్ట్రాన్ని వీడి గోవా తరపున రంజీలో ఆడిన విషయం తెలిసిందే.

ఆస్ట్రేలియాలో జరిగిన బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని నుంచి తిరిగి వచ్చిన తర్వాత జైస్వాల్ దేశవాళీ క్రికెట్‌లో ముంబై తరపున రంజీలో ఆడాడు. టీమిండియా ప్లేయర్లు కచ్చితంగా దేశవాళీ టోర్నీల్లో ఆడాలని బీసీసీఐ నిబంధన పెట్టిన విషయం తెలిసిందే. దీంతో రంజీ



ట్రోఫీలో జైస్వాల్‌తో పాటు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ కూడా ఆడారు.

ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ తరపున జైస్వాల్ ఆడుతున్నాడు. కానీ ఇప్పటి వరకు అతను పెద్దగా స్కోర్ చేయలేదు. మూడు మ్యాచుల్లో అతను కేవలం 34 రన్స్ మాత్రమే చేశాడు. అత్యధిక స్కోరు 29 మాత్రమే. కొత్తగా వచ్చిన పవర్‌ప్లే రూల్స్‌తో జైస్వాల్ సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. గత 18 ఇన్నింగ్స్‌లో అతను 8 సార్లు మొదటి మూడు ఓవర్లలోనే ఔటయ్యాడు. 2024 సీజన్‌లో జైస్వాల్ 31 సగటుతో 435 రన్స్ స్కోర్ చేశాడు. దాంట్లో ఓ సెంచరీ, ఫిఫ్టీ ఉన్నాయి. గత రెండు సీజన్ల నుంచి జైస్వాల్ అటాకింగ్ ఆట తీరు 70 శాతం తగ్గినట్లు అంచనా వేశారు.

## రాజస్థాన్ రాయల్స్‌కు తీపి కబురు...



### సంజూ శాంసన్‌కు లైన్ క్లియర్

### ఐపీఎల్‌కు ముందు సంజూ కుడి చేతి చూపుడు వేలికి గాయం

### గత 3 మ్యాచ్‌లలో కేవలం బ్యాటింగ్ మాత్రమే చేసిన వైనం

### తాజాగా ఫిట్‌నెస్ టెస్టుల్ని క్లియర్ చేయడంతో ఎన్‌సీఏ నుంచి గ్రీన్ సిగ్నల్

### వికెట్ కీపింగ్, కెప్టెన్సీ బాధ్యతల్ని చేపట్టేందుకు సంజూకు లైన్ క్లియర్

**న్యూఢిల్లీ:** సంజూ శాంసన్ తిరిగి రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్) కెప్టెన్‌గా మైదానంలోకి అడుగుపెట్టనున్నాడు. వికెట్ కీపింగ్, కెప్టెన్సీ బాధ్యతల్ని స్వీకరించేందుకు ఆయనకు బీసీసీఐ ఆమోదం తెలిపింది. ఈ ఏడాది ఐపీఎల్ కు ముందు కుడి చేతి చూపుడు వేలికి గాయం కావడంతో గత మూడు మ్యాచ్‌లలో సంజూ కేవలం బ్యాటింగ్‌కు మాత్రమే వస్తున్న విషయం తెలిసిందే.

తాజాగా ఫిట్‌నెస్ టెస్టుల్ని క్లియర్ చేయడంతో బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో వికెట్ కీపింగ్, కెప్టెన్సీ బాధ్యతల్ని చేపట్టేందుకు సంజూకు లైన్ క్లియర్ అయింది.

కాగా, సంజూ శాంసన్ స్థానంలో గత మూడు మ్యాచ్‌లకు యువ ఆటగాడు రియాన్ పరాగ్ సారథ్య బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. ఇందులో రాజస్థాన్ ఒకటి గెలవగా, మరో రెండింటిలో పరాజయం పాలైంది.

## ఐపీఎల్ మ్యాచ్‌లో లెటర్ రైటింగ్ సంకేతం..

### లక్నో బౌలర్‌కు ఫైన్ విధించిన బీసీసీఐ

**లక్నో:** ఐపీఎల్‌లో లక్నోతో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ 8 వికెట్ల తేడాతో నెగ్గింది. అయితే ఆ మ్యాచ్‌లో అనుచితంగా ప్రవర్తించిన లక్నో సూపర్ గెయింట్స్ బౌలర్ దిగ్వేశ్ సింగ్ రాతీకి .. బీసీసీఐ జరిమానా విధించింది. మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించింది. ఓ డీమెరిట్ పాయింట్ కూడా జోడించారు. పంజాబ్ కింగ్స్ బ్యాటర్ ప్రియాన్ష్ ఆర్యను ఔట్ చేసిన తర్వాత .. అతని వద్దకు వెళ్లి లెటర్ రైటింగ్ సంకేతం చేస్తూ బ్యాటర్‌ను అవమానించాడు. ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు రాతీకి జరిమానా విధిస్తున్నట్లు బీసీసీఐ తెలిపింది.

ఏకనా స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో లక్నో ఫస్ట్ బ్యాటింగ్ చేసి నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 171 రన్స్ చేసింది. ఆ తర్వాత ఆ టార్గెట్‌ను మరో 22 బంతులు మిగిలి ఉండగానే పంజాబ్ అందుకున్నది. కేవలం రెండు వికెట్లు మాత్రమే ఆ జట్టు కోల్పోయింది. పంజాబ్ జట్టులో ప్రభ్‌సిమ్రన్ సింగ్ 69, శ్రేయాస్ 52, వదేరా 43 రన్స్ చేశారు. ఐపీఎల్‌లోని ఆర్టికల్ 2.5 కింద లెవల్ 1 రూల్‌ను ఉల్లంఘించినట్లు లక్నో బౌలర్ దిగ్వేశ్ అంగీకరించాడు. మ్యాచ్ రిఫరీ విధించిన ఫీజును అతను



ఆమోదించాడు. మ్యాచ్ రిఫరీ తీసుకున్న నిర్ణయమే ఫైనల్ అని ఐపీఎల్ మీడియా అడ్వైజరీ ఓ ప్రకటనలో తెలిపింది.

ఇన్నింగ్స్ మూడవ ఓవర్‌లో షార్ట్ బంతిని పుల్ షాట్ ఆడబోయిన ఆర్యా క్యాచ్ అవుట్ అయ్యాడు. టాప్ హెడ్జ్ తీసుకున్న ఆ బంతిని .. మిడాన్ నుంచి వచ్చి శార్దూల్ అందుకున్నాడు. 9 బంతుల్లో 8 రన్స్ చేసి ఔటైన తర్వాత పెవిలియన్‌కు వెళ్తున్న సమయంలో.. ఆర్యా వద్దకు లెటర్ రాస్తున్నట్లు సంకేతం చేశాడు. గతంలో ఇద్దరూ ఢిల్లీ టీ20 లీగ్‌లో ఒకే జట్టు తరపున ఆడారు. అయితే దిగ్వేశ్ చేసిన సంకేతాన్ని.. వెస్టిండీస్ పేసర్ కెస్రిక్ విలియమ్స్ చేసిన నోట్‌బుక్ సంకేతంతో పోల్చారు. 2019 సిరీస్‌లో కోహ్లీని ఔట్ చేసిన సమయంలో కెస్రిక్ ఇలాగే సంకేతం ఇచ్చాడు.



# అలియా భట్‌తో పోల్చకండి ప్లీజ్..

## నటి షాలినీ పాండే వెల్లడి

టాకీస్: బాలీవుడ్ నటి అలియాభట్‌తో తనని పోల్చి చూడటంపై తనకు ఏమాత్రం నచ్చలేదని నటి షాలినీ పాండే అన్నారు. తనని తనలా గుర్తిస్తే చాలని ఓఇంటర్వ్యూలో చెప్పారు. ప్రేక్షకులు నన్నెంతగానో ప్రేమిస్తున్నారు. వారి ప్రేమాభిమానాలు వెలకట్టలేనివి. కొంతమంది నన్ను నటి అలియాభట్‌తో పోలుస్తూ తమ ప్రేమను తెలియజేస్తున్నారు. మనకు ఇండస్ట్రీలో ఇప్పటికే ఒక అలియా ఉన్నారు. కాబట్టి, ఆమెలా మరొకరు అవసరం లేదు. ఆమెలా ఉండాలని వేరొకరు అనుకోరు. ఎందుకంటే, ఆమె అద్భుతమైన నటి. సినిమాల్లోనే కాదు. నిజ జీవితంలోనూ ఆమె ఎంతో ఉన్నతంగా ఉంటారు. నేను కూడా ఆమె నుంచి ఎంతో స్ఫూర్తి పొందుతుంటానని అన్నారు. నాకంటూ ఒక గుర్తింపు తెచ్చుకోవాలనేది నా ఉద్దేశం అని షాలినీ పాండే తెలిపారు. 2017లో విడుదలైన 'అర్జున్ రెడ్డి'తో ఆమె హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చారు. తొలి చిత్రంతోనే గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం ఆమె బాలీవుడ్‌లో సినిమాలు, సిరీస్‌లు చేస్తున్నారు. షాలినీ పాండే ఇటీవల నటించిన వెబ్‌సిరీస్ 'డబ్బా కార్టెల్'. షబానా అజ్మీ, జ్యోతిక కీలక పాత్రల్లో నటించారు. నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది.





# చిరంజీవితో నాని సినిమా

## అంచనాలను పెంచిన ప్రకటన

**టాకీస్:** నేచురల్ స్టార్ నాని ఇప్పుడు హీరోగా కన్నా నిర్మాతగానే అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. కారణం ఆయన చేసే ప్రతి సినిమా కూడా సూపర్ హిట్ అవుతుంది. రీసెంట్‌గా కోర్ట్ అనే సినిమాతో పెద్ద విజయం సాధించారు. ఈ క్రమంలో నాని అంటే మంచి సినిమాలు చేస్తాడని ఫ్యాన్స్ తో పాటు ప్రేక్షకులు, కూడా ఫిక్స్ అయ్యారు. ప్రస్తుతం నాని శైలేష్ కొలను దర్శకత్వంలో సొంత బ్యానర్ లో హిట్3 సినిమా చేస్తున్నాడు. అలానే ది ప్యారడైజ్ అనే చిత్రంలోను నటిస్తున్నాడు. అయితే రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నాని తన ఫ్యూచర్ ప్రాజెక్టుల గురించి కొన్ని ఆసక్తికర విషయాలను వెల్లడించాడు.

త్వరలో దసరా డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెలతో చిరంజీవి ఓ ప్రాజెక్ట్ చేయనుండగా, దీనికి నాని సహ నిర్మాతగా వ్యవహరించనున్నారు. ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు బాగా ఉన్నాయి. అందుకు కారణం ఈసారి మళ్లీ రక్తం పారాల్సిందే అంటూ శ్రీకాంత్ చాలా వయెలెంట్ సినిమా చేస్తున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. దీని గురించి తాజా ఇంటర్వ్యూలో నాని మాట్లాడుతూ.. చిరంజీవి గారు అనగానే డ్యాన్స్, యాక్షన్ అని మనం ఒక అభిప్రాయానికి వచ్చేశాం..కానీ ఆయన అంతుకుమించి.. చిరంజీవి కేవలం అది మాత్రమే కాదు.. ఆయన్ని ప్రతి ఫ్యామిలీలో ఒక మెంబర్‌గా భావిస్తాం.. కానీ ఆ విషయాన్ని మనం మర్చిపోయి వేరే దేనిపైన ఫోకస్ చేస్తున్నాం. ఇప్పుడు శ్రీకాంత్ మ్యాడ్‌నెస్‌ని చిరంజీవి గారి సినిమా అంటే అది చాలా సూపర్ కాంబో.. అసలు నా లైఫ్‌లో చిరంజీవి గారి లాంటి స్థాయి వ్యక్తిని పెట్టి నేను ఓ సినిమా తీస్తానని ఎప్పుడూ ఊహించలేదు.. కానీ అనుకోకుండా ఇది కుదిరింది.. ఇది గొప్ప బాధ్యతగా భావిస్తున్నా.. ఖచ్చితంగా ది బెస్ట్ ఇస్తాం అంటూ నాని కామెంట్స్ చేశారు. ప్రస్తుతం నాని చేసిన కామెంట్స్‌తో మూవీపై అంచనాలు అమాంతం పెరిగాయి. నాని, చిరంజీవికి ఈ ప్రాజెక్ట్ మెమోరబుల్‌గా ఉండడం ఖాయమని అంటున్నారు.. ఈ వచ్చే ఏడాది ఈ సినిమా షూటింగ్ ప్రారంభమవుతుందని తెలిపారు.

# రెండో సినిమా ప్రకటించిన నీహారిక

## సంగీత్ శోభన్‌తో తదుపరి చిత్రానికి రెడీ

టాకీస్: మెగా బ్రదర్ నాగబాబు ముద్దుల తనయ నిహారిక యాంకర్‌గా, హీరోయిన్‌గా,నిర్మాతగా టాలీవుడ్ ఇండస్ట్రీలో సత్తా చాటుతుంది. హీరోయిన్‌గా నిహారిక చేసిన సినిమా ఒక్కటి హిట్ కాలేదు. దాంతో నిర్మాత అవతారం ఎత్తింది. నిహారిక నిర్మించిన కమిటీ కుర్రోళ్లు సినిమా సంచలన విజయం సాధించింది. ముందుగా హీరోయిన్ గా, తర్వాత వెబ్ సిరీస్ ల్లో నటించిందికానీ చివరకు నిర్మాతగా స్థిరపడింది. నిహారిక ఇటీవలే చిరంజీవి విశ్వంభర చిత్రంలోని ఓ పాటలో షూటింగ్ లో పాల్గొంది. ఈ పాటలో సాయిధరమ్ తేజ్ కూడా పాల్గొన్నారు. నటిగా మంచి మార్కులు దక్కించుకోలేకపోయిన నిహారిక నిర్మాతగా సత్తా చాటుతుంది. కొత్త డైరెక్టర్, కొత్త నటీనటులతో చిన్న సినిమాగా వచ్చిన కమిటీ- కుర్రోళ్లు చిత్రం 50 కోట్ల వసూళ్లు సాధించి అందరి దృష్టిని ఆకర్షించింది.. ఇప్పుడు నిహారిక నిర్మాతగా రెండో సినిమాతో పలకరించబోతుంది. తన రెండు సినిమాని అధికారికంగా ప్రకటించింది. ఈ సినిమాలో ఫుల్ ఫామ్ లో ఉన్న నటుడు సంగీత్ శోభన్ హీరోగా నటించబోతున్నాడు. మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్ సినిమాలతో పాటు- ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ, 3 రోజెస్.. పలు సిరీస్ లతో ఫుల్ ఫేమ్ తెచ్చుకున్న సంగీత్ ఇందులో మెయిన్ లీడ్ పోషించబోతున్నాడు. సంగీత్ సోలో హీరోగా నటించనున్న తొలి సినిమా ఇదే. ఈ సినిమాకు మానస శర్మ దర్శకత్వం వహిస్తున్నారు. అయితే ఈ ఇద్దరు గతంలో నిహారికతో కలిసి పని చేశారు. నిహారిక రూపొందించిన వెబ్ ప్రాజెక్ట్స్‌లో హీరో సంగీత్ శోభన్, డైరెక్టర్ మానస శర్మ భాగం అయ్యారు. జీ5తో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ రూపొందించిన వెబ్ సిరీస్ 'ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ'కి మానస శర్మ రచయితగా పని చేశారు. 'ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ'లో సంగత్ శోభన్ ప్రధాన పాత్ర పోషించారు. ఇక సోనీ లివ్ రూపొందించిన 'బెంచ్ లైఫ్'కి మానస శర్మ దర్శకురాలిగా పని చేశారు. గతంలో ఈ ముగ్గురు కలిసి అద్భుతాలు చేయగా, ఇప్పుడు ఫీచర్ ఫిల్మ్ సరికొత్త హిస్టరీ క్రియేట్ చేసేందుకు రెడీ అయ్యారు.

ఈ ప్రాజెక్ట్‌కి మానస శర్మ కథను అందించగా మహేష్ ఉప్పల కో రైటర్‌గా స్క్రీన్ ప్లే, డైలాగ్స్ అందించారు. మన్యం రమేష్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు.



# అద్భుత చిత్రరాజ్యం..ఆదిత్య 369

## అప్పట్లో ఆదిత్య-369 అద్భుత విజయం సాధించింది

## అంతేకాదు మంచి సినిమాగా నిలిచింది

**టాకీస్:** దర్శకుడు సింగీతం ఖాతాలో హిట్ పడింది. ఆయన ప్రతిభన్ మరోమరాఉ చాటింది. ఈ సినిమా గురించి ... ఇదేం నేపథ్యంఅని అప్పట్లో చాలామంది సందేహించారు. సినిమా విడుదలై, ప్రేక్షకులను కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లడం చూసి ఆశ్చర్యపోయారు. దాదాపు 34 ఏళ్ల క్రితం తెరకెక్కిన ఈ సినిమా అధునాతన సాంకేతిక విలువలతో ఈ నెల 4న రీ రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు నాటి విశేషాలు పంచుకున్నారు. హాలీవుడ్ మూవీ 'బ్యాక్ టు- ది ఫ్యూచర్' స్ఫూర్తితో 'ఆదిత్య 369' తీశానని అనడాన్ని తిప్పికొట్టారు. ది టైమ్ మిషన్' నవలను తాను




కాలేజీ రోజుల్లోనే చదివానని, అందులోని ఆసక్తికర అంశాల గురించి స్నేహితులతో చర్చించేవాడిని. డైరెక్టర్‌ని అయిన తర్వాత ఆ కాన్సెప్టుతో సినిమా చేస్తే బాగుంటుందనిపించింది. ఓ సారి విమాన ప్రయాణం చేస్తుండగా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంతో నా ఆలోచన చెప్పా. ఎంతో ఉత్సాహం చూపిన ఆయన 'ఐడియా బాగుంది. తప్పకుండా చేద్దాం' అని అన్నారు. ఇద్దరు ముగ్గురు ప్రముఖ నిర్మాతలకు ఆయనే ఈ కథ వినిపించారు. కానీ, వారికి సైన్స్ ఫిక్షన్ కాన్సెప్టు అర్థం కాలేదు. ఇదేదో ఫాంటసీ సినిమా అనుకున్నారు. కథపై నమ్మకం ఉన్న ఎస్పీబీ పట్టు వదలకుండా.. నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్‌ను సంప్రదించారు. ఆయనకు బాగా నచ్చడంతో సినిమా పట్టాలెక్కింది. హీరో పాత్రకు ముందు నుంచీ బాలకృష్ణనే అనుకున్నాం. స్టోరీ విన్న వెంటనే ఆయన నటించేందుకు అంగీకరించారు.

# బాలీవుడ్ బడా హీరోతో సినిమా..

## పవన్ కళ్యాణ్ ప్రాజెక్ట్ అటకెక్కినట్టేనా?



**టాకీస్:** టాలీవుడ్ టాప్ డైరెక్టర్స్‌లో హరీష్ శంకర్ ఒకరు. ఆయన గబ్బర్ సింగ్‌తో మంచి క్రేజ్ సంపాదించుకున్నారు. అయితే ఈ సినిమా తర్వాత మళ్లీ హరీష్ శంకర్‌కి ఆ రేంజ్‌లో హిట్ పడలేదు. డిజాస్టర్ ఫేజ్‌లో ఉన్నాడు. ప్రస్తుతం హరీష్ శంకర్ నాలుగైదు సినిమాలు చేయడానికి సిద్ధంగా ఉన్నాడు. వాటిలో బాలీవుడ్ హీరోతో సినిమా కూడా ఒకటి ఉన్నట్టు తెలుస్తుంది. గత ఏడాది రిలీజ్ అయిన 'మిస్టర్ బచ్చన్' సినిమాతో హరీష్ శంకర్ భారీ ఫ్లాప్ మూటగట్టుకున్నాడు. 'రైడ్' అనే హిందీ సినిమాకు రీమేక్ గా రూపొందిన ఈ సినిమా కనీసం యావరేజ్ టాక్ కూడా తెచ్చుకోలేకపోయింది. పవన్ కళ్యాణ్ తో ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రం చేసి మంచి హిట్ కొడతాడా అని అందరు అనుకున్నారు. కాని ఈ సినిమా ఇప్పటికీ సెట్స్ మీదకు వెళ్లలేదు. ఇక హరీష్ శంకర్ ఏ హీరోతో సినిమా చేస్తాడు అంటే రోజుకొక హీరో పేరు వినిపిస్తుంది. ఇటీవల ఆయన సల్మాన్ ఖాన్ కి ఓ కథ చెప్పాడని, హరీష్ శంకర్ నేరేషన్ కి ఫిదా అయిన కండల వీరుడు వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు ప్రచారం జరుగుతుంది. మైత్రి మూవీ మేకర్స్ ఈ మూవీని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించనుందని, త్వరలోనే ఈ కాంబోకి సంబంధించిన అఫీషియల్ అనౌన్స్మెంట్ రానుందని చెబుతున్నారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.